


రూ.1500 కోట్ల ఇసుకను బొక్కేశారు

జగన్ పాలనలో దాదాపు జిల్లాలో రూ.1500 కోట్ల మేర విలువ చేసే ఇసుకను లూటీ చేశారని చెబుతారు. ఇసుక అక్రమ తవ్వకాలపై టీడీపీ నేతలు ఆందోళన చేసినా కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదు. పర్యావరణానికి హాని కలుగుతుందంటూ న్యాయస్థానాల తలుపు తడితే కానీ అధికారులు స్పందించలేదు. కళ్లెదుట అక్రమంగా ఇసుక తవ్వుతున్నా కూడా అధికారులు కళ్లుండి కబోదుల్లా వ్యవహరిస్తూ వైసీపీ నేతల అక్రమాలకు ఊతమిచ్చారు. వెరసి జిల్లాలో పెన్నా, పాపాఘ్ని నదులకు గర్భశోకం మిగిల్చారు. ఇక వాగులు, వంకలు ఇలా ఒకటేంటి ఇష్టారాజ్యంగా ఊడ్చి పారేశారు.

- వాల్టా చట్టానికి తూట్లు
- తవ్వాల్సింది మీటరు.. తవ్వింది 3 మీటర్లు
- అడ్డుకునే నాథుడు లేడు
- నదులను చెరబట్టిన వైసీపీ మూకలు
- చంద్రబాబు హయాంలో ఉచితంగా ఇసుక
- నాడు ట్రాక్టరు రూ.1500 నుంచి రూ.2వేలు
- జగనన్న పాలనలో రెక్కలు.. నేడు రూ.5వేలు



ఇది కేజీఎఫ్ గనులు కాదు.. జగన్ పాలనలో ఇసుక కోసం నదులను గుల్ల చేసిన వైనం

(కడప - ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో ఇసుక ఉచితంగా దొరికేది. అప్పట్లో కడపలో 2019 వరకు ట్రాక్టరు ఇసుక రూ.1500 నుంచి రెండు వేల లోపు ఉండేది. అటు పేదలకు, ఇటు నిర్మాణదారులకు ఇసుక భారం కాలేదు. అయితే జగన్ సీఎం అయిన తరువాత అంతా తలకిందులైపోయింది. నూతన ఇసక పాలసీ పేరిట ఇసుక తవ్వకాలను నిలిపివేసి నిర్మాణ రంగాన్ని కుదేలయ్యేలా చేశారు. పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు పస్తులున్నారు. ఆలస్యంగా నూతన ఇసక పాలసీ అంటూ 2019 సెప్టెంబరు 5 నుంచి కొత్త పాలసీని తీసుకువచ్చారు. తొలుత ఇసుక తవ్వకాలను ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థకు అప్పగించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత దాన్ని మార్చి ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. అంతే అక్కడ నుంచి తవ్వుకో నా సామిరంగా తవ్వుకో అంటూ ప్రైవేటు మాటున వైసీపీ అండ్ కో గ్యాంగ్ స్వైరవిహారం చేశారు. నదుల్లో పడి ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేసుకున్నారు.

తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత

నూతన ఇసుక పాలసీతో జిల్లాలో ప్రైవేటు సంస్థకు అప్పగించి. తవ్వకాలు చేపట్టారు. అయితే ముఖ్యనేత బంధువులు కడప జిల్లాలో రీచ్‌లను సబ్‌లీజుకు తీసుకుని రీచ్‌ల వారీగా సబ్‌రీచ్‌లు కేటాయించారు. ఒక్కో రీచ్ బట్టి రూ.2 కోట్ల నుంచి 5 కోట్లు కేటాయించారు. నెలకు రూ.20 కోట్లు లీజుకు ఇచ్చారు. జిల్లాలో పెండ్లిమర్రి మండలంలోని పాపాఘ్ని నదిలో కొత్తగంగిరెడ్డిపల్లె, తుమ్మలూరు, కొండూరు, ఉలవలపల్లె, కమలాపురంలోని ఎర్రబల్లి, కొత్తపల్లె, వేంపల్లెలోని పాపాఘ్ని, వీఎన్‌పల్లె సమీపంలోని సంగమేశ్వరదేవాలయం, తాటిమాకులపల్లె, వల్లూరు మండలంలోని చెరవుకిందపల్లె, పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె, చెన్నూరు సమీపంలో ఇసుక రీచ్‌లు కేటాయించారు. అలాగే ఖాజీపేట మండలంలోని చెన్నముక్కపల్లె, వెదురూరు, సిద్దవటంలోని జంగాలపల్లె, ఎస్.రాజ ంపేట, చక్రాయపేటమండలంలోని గడ్డంవారిపల్లె, కొండాపురంలోని ఆర్ఎస్ కొండాపురం, పొట్టిపాడు, వెంకయ్యకాల్వ, కొండాపురంలోని పి.అనంతపురం, ప్రొద్దుటూరులో చౌడూరు, కొత్తపల్లె, రామాపురం, పెద్దశెట్టిపల్లె, రామేశ్వరం ప్రొద్దుటూరు బైపాస్, సంగనూరుపల్లె, కల్లూరు, తాళ్లపల్లె, ఆర్‌టీపీపీ రోడ్డు, వాటర్ హెడ్, జమ్మలమడుగులో పొన్నతోట, గూడెం, గూడెంచెరువు, అంబవరం, పి.సుగమంచిపల్లె, గొరిగనూరు, ముద్దనూరు రోడ్డు ప్రాంతంలో రీచ్‌లతో పాటు ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా తవ్వేశారు.

అడ్డగోలుగా దోచుకున్నారు..

జగన్ సీఎం అయిన తరువాత అభివృద్ధి అటకెక్కింది. జిల్లాలో అభివృద్ధి పనులు లేవు.. కాంట్రాక్టు పనులు లేవు. అందుకే వైసీపీ నేతలు ఇసుక, గ్రావెల్, మట్టి, భూములపై పడ్డారు. ఏరియాలు పంచుకుని ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఇసుక నుంచి తైలం తీసినట్లుగా అడ్డగోలుగా తవ్వి దోచుకున్నారు. మీటరు మించి తవ్వకాలు జరపకూడదని నిబంధనలు ఉన్నా.. 3 నుంచి 4 మీటర్లు తవ్వేశారు. కేజీఎఫ్ సినిమాలోలా గనుల్లో తవ్వకాలు చేశారు. తవ్వకాలను చూస్తే అసలు ఇది నదేనా అన్నట్లు ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వేశారు. చెన్నూరు సమీపంలోని పెన్నానది బ్రిడ్జి వద్ద క్వారీ ఒక చోట అయితే అడ్డగోలుగా మరో చోట తవ్వేశారు. చివరికి తాగునీటి పైపులైన్లు కూడా ధ్వంసమయ్యాయి. తాగునీటికి ఇబ్బందులు వస్తాయని రైతులు, స్థానికులు అభ్యంతరం తెలిపితే అడ్డుకుంటే టిప్పరుతో తొక్కిస్తామంటూ ఇసుకాసురులు జనాన్ని భయభ్రాంతులకు గురిచేశారు. మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జ్ చివరికి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇటు వల్లూరు మండలంలో చెరువుకిందపల్లెలో అడ్డగోలు తవ్వకాలు నిలిపివేయాలని స్థానికులు ఆందోళన చేసినా పట్టించుకోలేదు. చివరికి కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది.

ఇసుకనే ఆదాయ వనరుగా ఎంచుకున్న వైపీపీ మూకలు అడ్డగోలు తవ్వకాలకు బరి తెగించారు. అధికారం మాదే మమ్మల్ని ఎవరు ఆపుతారనే ధీమాతో వారిష్టమొచ్చినట్లు తవ్వుకున్నారు. నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు వైసీపీకి దాసోహమయ్యారు. ప్రొద్దుటూరు మండలంలో ఇసుకను ముఖ్యనేత అనుచరుడు కనుసన్నల్లో జరుగుతున్న ట్లు చెబుతారు. ఇలా వైసీపీ నేతలంతా ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేసి రూ.కోట్లు సంపాదించుకున్నారు. కడప నుంచి ఇసుకను బెంగుళూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, గిద్దలూరు ఇతర ప్రాంతాలకు భారీగా తరలించారు. ఇసుక తవ్వకాలు ఆపండని మొత్తుకున్నా పట్టించుకునేవారు లేరు.



ఓ కాంట్రాక్టరు నుంచి కడప జిల్లా రీచ్‌లను ముఖ్యనేత బంధువులు తీసుకున్నారు. ఆయన వాటిని సబ్‌లీజుకు ఇచ్చారు. ఎలా అంటే అనుమతి లేని చోట కూడా ఇచ్చేశారు. సిండికేట్లుగా మారి దోచారు. బద్వేలు నియోజకవర్గానికి చెందిన నారాయణరెడ్డి అనే వ్యక్తి ఇసుక రీచ్ కోసం సీఎం బంధువుకు రూ.81 లక్షలు ఇచ్చారు. అక్కడ తవ్వకాలు జరిపారు. ఇక్కడి ఇసుక రీచ్‌లకు అనుమతులు లేవంటూ నిలిపివేశారు. దీంతో నారాయణరెడ్డి పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇది అప్పట్లో రాష్ట్రంలో సంచలనంగా మారింది.

ఇక తొలినాళ్లలో టన్ను ఇసుక రూ. 375 ఉండగా ఇటీవల రూ.475కు పెంచారు. దీంతో ఇసుక ధరలు అమాంతంగా పెరిగాయి. అడ్డగోలుగా నిబంధనలకు మించి అదనపు లోడుతో ఇసుక రవాణా కావడంతో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. నూతన ఇసక పాలసీ వల్ల బాగుపడింది కేవలం వైసీపీ నేతలు మాత్రమే. అధిక ధరల వల్ల జనం ఇబ్బంది పడితే ప్రభుత్వ ఖజానాకు గండిపడింది. ఇష్టారాజ్యంగా తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి.



ఇసుక టిప్పర్ల రవాణాతో దెబ్బతిన్న రోడ్లు



పెండ్లిమర్రి, చెన్నూరు, ఖాజీపేట, సిద్దవటం, చక్రాయపేట, కడప పరిధిల్లోనే సుమారు వెయ్యి కోట్ల మేర ఇసుక తవ్వకాలు జరిగినట్లు ఓ అంచనా. ఇక ప్రొద్దుటూరు. జమ్మలమడుగు ప్రాంతాల్లో రూ.500 కోట్లకు పైగా ఇసుక తవ్వకాలు జరిగినట్లు చెబుతారు. సుమారు రూ.1500 కోట్ల మేర ఇసుక తవ్వకాలు జరిగితే ప్రభుత్వానికి వెళ్లింది మాత్రం నామమాత్రమే అంటారు.

మళ్లీ ఉచిత ఇసుక

టీడీపీ అధికారంలోకి వస్తే జూన్ నుంచే ఉచిత ఇసుకను ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇది నిర్మాణ రంగాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.



భగ భగలు

- నిప్పులు కక్కుతున్న సూరీడు
- మండుతున్న ఎండలు..



కడప (సెవెన్‌రోడ్స్), మే 3: ఇవేం ఎండలు రా నాయనా.. బతుకుతామా.. చస్తామా.. ఎక్కడ చూసినా ఇదే చర్చ... పొద్దు పొడిచింది మొదలు సూరీడు నిప్పులు కక్కుతున్నాడు. దీంతో ఉదయం నిద్ర లేచింది మొదలు జనం బయటకు అడుగు పెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. ఇక ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు ఎండల ధాటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతలను ఒక్కసారి పరిశీలిస్తే.. ఎండల తీవ్రత ఎంత మేర ఉందో అర్థమవుతుంది..

మండలాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతలు.

కమలాపురం మండలంలో 47.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే పోరుమామిళ్ల 46.7, జమ్మలమడుగు 46.9, అట్లూరు 45.6, బి.కోడూరు 45.6, దువ్వూరు, గోపవరం, ఖాజీపేట, పెండ్లిమర్రి, 45.6 డిగ్రీలు, బద్వేలు 45.5, సీకేదిన్నె 45.5, ప్రొద్దుటూరు 46.3 డిగ్రీలు నమోదు కాగా, కడప, కలసపాడు, మైలవరం-1, బ్రహ్మంగారిమఠం, సిద్దవటం, ఒంటిమిట్టలలో 46.2 డిగ్రీలు నమోదయ్యాయి. వల్లూరు 46.1, సింహాద్రిపురం 45.9, ఎర్రగుంట్ల 45.8, వేంపల్లె 44.7, తొండూరు 44.9 తొండూరు, మిగతా మండలాలు 44.2 డిగ్రీల వరకు నమోదయ్యాయి. రేపు, ఎల్లుండి కూడా దాదాపు ఇదే ఉష్ణోగ్రతలు నమోదయవుతాయని.. అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

పెన్షన్ కోసం వెళ్లి.. వడదెబ్బకు గురై ఇరువురి మృతి



వడదెబ్బతో మృతి చెందిన నాగిపోగు ఎల్లమ్మ వల్లెంకొండు రామయ్య ఫైల్‌ఫోటోలు

బద్వేలుటౌన్ మే 3: పెన్షన్ కోసం వృద్ధులు పడరాని పాట్లు పడుతున్నారు. పెన్షన్ డబ్బుల కోసం మండు టెండల్లో బ్యాంకుల చుట్టూ తిరుగుతూ తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పట్టణంలోని సురేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న నాగిపోగు ఎల్లమ్మ (64) వితంతు పెన్షన్‌కోసం బ్యాంకు దగ్గరకు రెండుసార్లు వెళ్లింది. ఎండలో నిలుచొని పెన్షన్ తీసుకుని ఇంటికి తిరిగి వచ్చింది. ఎండతీవ్రతను తట్టుకోలేక గురువారం సాయంత్రం అస్వస్థతకు గురై సొమ్మసిల్లిపడిపోయింది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈమెకు కుమారుడు, ఇద్దరు కూతుర్లు కలరు. అదే విధంగా పోరుమామిళ్లరోడ్ అమ్మవారిశాలవీధికి చెందిన వల్లెంకొండు రామయ్య(72) శుక్రవారం పెన్షన్‌కోసం వెళ్లి ఆధార్‌కార్డు లింకుకాకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చి ఎండ తీవ్రతను తట్టుకోలేక సొమ్మసిల్లిపడిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు ఎంత పిలిచినా పలకకపోవడంతో మృతి చెందినట్లు తెలిపారు.

వయస్సులోనే కాదు.. దోపిడీలోనూ పెద్దాయనే

- ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై షర్మిల్ సెటైర్



మైదుకూరులో మాట్లాడుతున్న షర్మిలా

మైదుకూరు/చాపాడు, మే 3: మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వయస్సులో పెద్దాయన.. అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఇసుక దోపిడీ, మట్టి మాఫియాలో కూడా పెద్దాయనే అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగాస్త్రం సంధించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆమె వివేకా కుమార్తె డాక్టర్ సునీతతో కలసి మైదుకూరు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ వైయస్సార్ శంకుస్థాపన చేసిన రాజోలు జలాశయానికి జగన్ కూడా మరోసారి శంకుస్థాపన చేసి కనీసం ఒక్క తట్ట మట్టి పని కూడా చేయలేదన్నారు. ఇప్పటికి ప్రాజెక్టు పూర్తి అయ్యింటే లక్ష ఎకరాలు సాగులో ఉండేదని, హామీ లిచ్చి మోసం చేసిన ఇటువంటి వ్యక్తులు మనకు అవసరమా అన్నారు. రాష్ట్రాన్ని జగన్ అప్పుల కుప్ప చేసి చేతిలో చిప్ప పెడుతున్నాడు. జగన్‌కు పాలన చేతకాదు, తెలిసిందల్లా హత్యా రాజకీయాలే అన్నారు. ఇక అవినాశ్‌రెడ్డి స్టీల్ ప్లాంట్, ప్రత్యేక హోదా కోసం ఎప్పుడైనా పార్లమెంట్‌లో అడిగాడా అని ప్రశ్నించారు. తండ్రికి, చిన్నాన్నకు ద్రోహం చేసిన వైసీపీకి ఆయన ఫొటో పెట్టుకునే హక్కులేదని సునీతారెడ్డి అన్నారు. వైయస్సార్ ఫొటో పెట్టుకునే హక్కు ఒక్క షర్మిలాకే ఉందని, ఆమె ఒక్కటే ఆయన వారసురాలు, షర్మిలాను భారీ మెజార్టీతో గెలిపిస్తే వైయస్‌కు, వివేకాకు ఆత్మాలకు శాంతి కలుగుతుందన్నారు.

5, 6న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



కడప(కలెక్టరేట్) మే 3: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు, అత్యవసర సేవల సిబ్బందికి అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ పెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. 5వ తేదీ ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, ఓపీవోలకు, 6న పోలింగ్ పర్సనల్స్ అత్యవసర సేవలందించే వారు, ఇతర విభాగాల (బీఎల్వోలు, కంట్రోల్ రూమ్ స్టాఫ్, ఆర్వోల ఆఫీసు స్టాఫ్, డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు, క్లీనర్లు,) ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలె ట్ ఓటు 5 వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వినియోగించు కోవచ్చన్నారు. 6,7 తేదీల్లో హోమ్ ఓటింగ్ 85 ఏళ్ల పైబడి మంచానికి పరిమితమైనవారు, వికలాంగులు, కొవిడ్ ఎఫెక్టెడ్ ఓటర్లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ఓటింగ్ నదుపాయం కల్పిస్తారని తెలిపారు. కాగా, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మే 13న ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 23203 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించామన్నారు. 5వ తేదీ పీవో, ఏపీవో, ఓపీవోలకు సంబంధించి ఓటింగ్ పక్రియ ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలన్నారు. పక్క జిల్లాలో ఓట్లు ఉండి, ఇక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులకు సంబంధించిన ఓటర్లకు కడప పెసిటీటీ కేంద్రంలో ఓటు వినియోగించుకోవాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం వేట

సార్వత్రిక ఎన్నికల్లో ఏదో రకంగా గెలిచేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రధాన రాజకీయ పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల ఫోన్ నెంబర్లు ఎలా సేకరించారో కానీ నేరుగా వారి ఫోన్ల ద్వారా ఓటుకు నోటు అందించేందుకు రాజకీయ పార్టీల నేతలు సిద్ధమయ్యారు. శుక్రవారం కడప నగరంలోనే కాక మరికొన్ని నియోజక వర్గాల్లో ఉద్యోగుల వివరాలు గుప్పిట్లో పెట్టుకున్న అధికారపార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నేతలు ఓటుకు నోటు ఇచ్చేందుకు సంప్రదిస్తున్నారు. తమ పార్టీకి ఓటువేయాలని, ఓటుకు రేటు (రూ.3-5 వేల వరకు) విధిస్తూ ఫోన్ ద్వారా సంప్రదిస్తుండడంతో ఉద్యోగులు కుంగుతింటున్నారు. గత ఎన్నికల్లో గంప గుత్తగా ఉద్యోగుల ఓట్లు వైసీపీ సొమ్ము చేసుకుంది. ఆ పరిస్థితి ఇపుడు అధికారపార్టీ నేతలకు కనిపించడం లేదు. ఈ ఎన్నికల్లో ఉద్యోగుల బ్యాలెట్ ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపితే పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయంగా కనిపిస్తోంది.

పేదలకూ జగన్ మస్కా

- ఇళ్లకు రిజిస్ట్రేషన్లంటూ ఖజానా నింపుకునేందుకు ఎత్తుగడ
- ఓటీఎస్ పేరుతో వందల కోట్ల వసూళ్లకు యత్నం
- ప్రతిపక్ష టీడీపీ తిరుగుబాటుతో సర్దుకున్న సర్కారు
- అప్పటికే జిల్లాలో ఓటీఎస్ వసూళ్లు రూ.14కోట్ల పైమాటే..



కడప(కలెక్టరేట్), మే 3: పేదలకే నవరత్నాల పథకాలంటూ జగన్ సర్కారు బాకా బజాయించింది. పేదలంటే ఎనలేని మమకారం, ప్రేమ తనకే పేటెంట్‌గా నమ్మబలికాడు. మరో పక్క నమ్మిన పేదలపై కనికరం లేకుండా ఏదోక పన్నుల రూపేనా బాదేసి జిల్లాలో వందలాది కోట్ల రూపాయిలు దండుకునేందుకు పెద్ద వ్యూహం రచించారు. 1983- 2011వ సంవత్సర కాలం లో అప్పటి ముఖ్యమంత్రులు రామారావు, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ వరకు జిల్లా వ్యాప్తంగా 2,89,284 మంది పేదలకు ఇళ్ల పంపిణీ చేశారు. ఆ ఇళ్లను జగన్ వదల్లేదు. తనకు సంబంధం లేని పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేసి పెనాల్టీ విధించేందుకు ఆఘమేఘాల మీద జీవో జారీ చేసి.. ఖజానా నింపుకునేందుకు ఎత్తుగడలు వేశా రు. పేదల ఇళ్లపై జగన్ సర్కారు పెత్తనం సహించలేని ప్రతిపక్ష టీడీపీ పేదల పక్షాన తిరుగు బాటుకు దిగింది. మరోపక్క పేదలు కూడా జగన్ సర్కారుకు సంబంధం లేని ఇళ్లపై వసూళ్లకు దిగడాన్ని ఎండగట్టడంతో ఓటీఎస్ ఊసెత్త లేదు. అయితే అప్పటికే జిల్లాలో రూ.14 కోట్లు సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పేదలను పిండి వసూళ్లు చేయడం గమనార్హం.

రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధం లేని ఓటీఎస్ రిజిస్ట్రేషన్లు

40 ఏళ్ల కిందట అప్పటి ముఖ్యమంత్రులు పేదలకు ఇచ్చిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేసుకుంటే అవసరాలకు రుణం పొందడంతో పాటు అమ్ముకోవచ్చని జగన్ సర్కారు జీవో తెచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.15వేలు చెల్లిస్తే చాలు.. ఒన్ టైం సెటిల్మెంట్ (ఓటీఎస్) పేరుతో పేదల ఇళ్లకు శాశ్వత రిజిస్ట్రేషన్లంటూ ఎరవేశారు. సచివాలయాల, రెవెన్యూ సిబ్బందికి ఆ బాధ్యతలను అప్పగించి టార్గెట్ పెట్టారు. వాళ్ల కాళ్లరిగేలా తిరిగి పేదలపై వత్తిడి పెంచారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ జగన్ సర్కారును నిలదీసి ఆందోళనకు సిద్ధమైంది. అప్పటికే జిల్లాలో రూ.14కోట్లు వరకు పేదల నుంచి ఓటీఎస్ పేరుతో వసూళ్లు చేశారు. అయితే ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అంతా కూడా రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధం లేకుండా సచివాలయాల సిబ్బందితో చేయించారు. దీంతో ఓటీఎస్ రిజిస్ట్రేషన్లకు బ్యాంకుల్లో పైసా పరపతి పుట్టడం లేదని పేదలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిపక్ష టీడీపీ పేదల ఇళ్ల ఓటీఎస్ రిజిస్ట్రేషన్లపై తిరుగుబాటు చేయకపోయి ఉంటే జిల్లాలో వేలాది మంది పేదలు కష్టార్జితం జగన్ ఖజానాకు చేరేదనే విమర్శలున్నాయి. సొమ్ము దండు కోవడంలో పేద, ధనిక వ్యత్యాసం లేదని, ఇదీ జగన్ సర్కారు బిజినెస్ మెంటాలిటీకి నిదర్శనమని ప్రతిపక్ష నేతలు, పేదలు విమర్శలు చేస్తుండడం గమనార్హం.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం. 2

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కడప ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. కడప				
2. కమలాపురం				
3. పులివెందుల				
4. జమ్మలమడుగు				
5. ప్రొద్దుటూరు				
6. మైదుకూరు				
7. బద్వేలు				
8. రాజంపేట				
9. రైల్వేకోడూరు				
10. రాయచోటి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వేనెం. : 137 & 138/3, చిన్నమాచుపల్లె, చెన్నూరు మండలం, కడప

వైసీపీ అరాచక పాలనను తరిమికొడదాం

- కడప నగరాభివృద్ధే టీడీపీ లక్ష్యం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



కడప నగరంలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), మే 3: కడప నగర అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ అరాచక పాలనను తరిమి కొట్టేందుకు అందరూ సహకరించాలని కోరారు. శుక్రవారం కడప నగరం 43, 44 డివిజన్లలో దర్గా సర్కిల్, కాగితాల పెంటలో రోడ్‌షో ని ర్వహించారు. అక్కాయపల్లె వికాస్ హైస్కూల్ సమీపంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో కనీస వసతులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇసుక, మట్టి, భూకబ్జాలు చేసేందుకు ఇక్కడి ఎమ్మెల్యే తన తమ్ముడు ప్రజలను బెదిరిస్తూ దోచుకుంటున్నారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కంబాల దిన్నెలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేస్తే అధికారంలోకి వచ్చిన జగన్ అదే పరిశ్రమకు రెండు సార్లు భూమిపూజ చేసి పనులు మాత్రం చేయలేదన్నారు. అలాగే షుగర్ ఫ్యాక్టరీ, పాల శీతలీకరణ పరిశ్రమ, నందలూరు ఆల్విన్ పరిశ్రమను తెరిపిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. పాత కడప చెరువును ట్యాంకు బండ్ చేస్తామని చెప్పి ఇంతవరకు అతీగతీ లేదన్నారు. పెట్టుబడులు రావాలన్నా, పరిశ్రమలు నెలకొల్పాలన్నా అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కడప నగ రంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యుల అరాచకాలకు అడ్డూఅదుపు లేదన్నారు. భూ కబ్జాలు, బెదిరింపులు, హత్యలు లీగల్ చేశారని ఆరోపించారు. మహిళలకు కనీసం గౌరవం కూడా ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. వెంచర్ల ముసుగులో ప్రభుత్వ భూములు సైతం వదలడం లేదన్నారు. కడప నగరంలో దాదాపు 400 వరకు అనధికార లేఔట్లు అధికారుల గుర్తించారంటే ఏ విధంగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారో అర్థమవుతోందన్నారు సీకే దిన్నె మూలవంక సమీపంలో 52 ఎకరాల ప్రభుత్వ స్థలంలో వెంచర్ వేసి విక్రయించారన్నారు. అక్రమ కట్టడాలు అని కొన్ని ప్రాంతాల్లో పేదల ఇళ్లను కూల్చారని పేర్కొన్నారు. కానీ వైసీపీ నాయకలవి అక్రమ కట్టడాలైనా వాటి వంక కన్నెత్తి కూడా చూడలేదన్నారు. జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని రూ. కోట్లు పెట్టి భూములు కొని వాటిలో వాటా కొట్టేశారని ఆరోపించారు. రిమ్స్ ఆస్పత్రితో పాటు ఇతర పీహెచ్‌సీలలో అరకొర వసతుల కారణంగా అనారోగ్య బారిన పడిన వారు ప్రాణాలు కోల్పోతున్నా ఇక్కడి ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. అపరిశుభ్రత, కలుషిత నీరు, దోమల వల్ల నగరంలో ప్రజలు నిత్యం అనారోగ్యానికి గురవుతున్నా ప్రభుత్వ ప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నగర ప్రజలకు రవాణా సౌకర్యం కూడా అంతంతమాత్రమేనన్నారు. బుగ్గవంకపై సహమీరియా దర్గా వద్ద రవీంద్రనగర్‌లో లా కాలేజీకి వెళ్లే దారిలో గతంలో ఉన్న రెండు బ్రిడ్జీలను తొలగించారని, దీంతో ఎంతోమంది ఇబ్బందిపడుతన్నార న్నారు.వీటిపై బ్రిడ్జీలు నిర్మిస్తామని ఎమ్మెల్యే మాట ఇచ్చారేగాని ఇంతవరకు పనులు ప్రారంభించింది లేదన్నారు. పాలెంపల్లె, వైఎస్సార్ నగర్, హోమియోపతి కాలేజీ, గాంధీనగర్ స్కూల్ నుంచి ప్రకాశ్‌నగర్‌కు వెళ్లే రోడ్లతో పాటు నగరంలోని ప్రతి రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. దీంతో గర్భిణులు, వాహనదారులు, రోగులు పడుతున్న ఇబ్బందులు వైసీపీ ప్రతినిధులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రిమ్స్ నుంచి సబ్‌జైల్ కూడలికి రావాలంటే సరైన రవాణా వ్యవస్థ లేదన్నారు. ప్రజలకు కనీసం వక్క బస్సు కూడా వేయలేదని ఆరోపించారు. కడప నగరం అంటూ ఒక బ్రాండ్ అని ఆ బ్రాండ్ నేమ్‌ను దెబ్బతీస్తూ పదేళ్లుగా ఎమ్మెల్యే మాఫియా నడిపిస్తున్నారన్నారు. యువతను ఉద్యోగాల ఊసే ఎత్తకుండా మత్తులో ముంచుతున్నార న్నారు.

డ్రగ్స్, గంజాయి లాంటివి తెచ్చి కడపలో విక్రయిస్తున్నారని ఎమ్మెల్యే ప్రమేయమే లేకుండా ఇలాంటి దందాలు ఎలా సాగుతాయన్నారు. మైనార్టీ మం త్రిగా ఉంటూ మైనార్టీలకు కూడా మొండిచేయి చూపారన్నారు. కోట్ల విలువజేసే మోచంపేటలోని హజ్రత్ రకీఫ్‌షావల్లి దర్గా భూమిని వైసీపీ రాష్ట్ర నాయకుడి బావమర్దికి దాదాదత్తం చేశారన్నారు. దాన్ని అడ్డుకున్న ముస్లిం పెద్దలను అరెస్టు చేయించి జైల్లో పెట్టించారన్నారు. దర్గా భూములు, వక్ఫ్ భూములు దొంగల పాలవుతుంటే చూ స్తూ ఆనందిస్తున్నారే తప్ప దాన్ని అడ్డుకోలేదన్నారు. పేదరికంలో మగ్గుతున్న ముస్లిం కుటుంబాలకు ఎలాంటి సా యం చేయలేదన్నారు. ముస్లిం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎలాంటి తోడ్పాటు కల్పించలేదన్నారు. వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజలు మోసపోయారని, ఈ సారైనా అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ కడప నగరాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుసుమకుమారి, ఖాజాపీర్, సుబ్బారెడ్డి, యూనస్, జాకీర్, వికాస్ హరిక్రిష్ణ, రాజశేఖర్, జిలానీ బాషా, రవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పాలకొండ దేవస్థానం చైర్మన్

కడప నగరం ద్వారకానగర్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నివాసంలో శుక్రవారం పాలకొండ దేవస్థానం చైర్మన్ దేసు సుబ్బారెడ్డి టీడీపీలోకి చేరారు. ఆయనకు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ మేనిఫెస్టోకు ఆకర్షితులై శ్రీనివాసరెడ్డిపై ఉన్న నమ్మకంతో పార్టీలో చేరానన్నారు. కార్యక్రమంలో కుసుమకుమారి, శివకొండారెడ్డి, నవనీశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

45వ డివిజన్‌లో...

కడప నగరం 45వ డివిజన్ చెమ్ముమియాపేటలో శుక్రవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిక్రిష్ణ ఆధ్వర్యంలో మాధవీరెడ్డిని గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఉదయ్, అనిల్, రమణ, మణి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి





ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

పులివెందుల టౌన్, మే 3: పట్టణంలోని అహోబిలాపురంకు చెందిన నాగాంజనేయులు, గోగుల శివ, గంగాధర్, నంద్యాల సురేష్, తమ్మిశెట్టి పెద్దిరాజు, కొమెర జయసింహ, బత్తల గంగిరెడ్డి, కొమెర సుబ్బన్నతో పాటు పలు కుటుంబాలు పులివెందుల టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి బీటెక్ రవి స్వాగతం పలికారు. తూగుట్ల సిద్దారెడ్డి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

చక్రాయపేట, మే 3: బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ నాయకులు ఓటర్లను కోరారు. శుక్రవారం మండలంలోని అంజనేయపురం, చక్రాయపేట, కొండవాండ్లపల్లె, అద్దాలమర్రి గ్రామాలలో ప్రచా రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేష్ రెడ్డి, పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

కడప అభ్యర్థిపై కేసు నమోదు

కడప(క్రైం), మే 3:మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేస్తూ కడప టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి ఓ వీడియో విడుదల చేశారు. దీనిపై ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘించారంటూ అధికారి వెంకటాచలం శుక్రవారం కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ రంగస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సమ్మర్ క్యాంపును వినియోగించుకోండి

కడప (ఎర్రముక్కపల్లె), మే 3: కడప నగరం అక్కాయపల్లె మహ్మదీయ మసీదు కమిటీ ఆధ్వర్యంలో 30 రోజులు ఆధ్యాత్మిక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మసీదు కమిటీ కార్యదర్శి సుభాన్ కోరారు. శుక్రవారం ఉదయం తరగతులను ప్రారంభిం చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్డీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, అంజుమన్ అధ్యక్షుడు సత్తార్ ఫైజి, కమిటీ అధ్యక్షుడు కరీముల్లా, కన్వీనరు మగ్బుల్ అహ్మద్, గురువులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో మహిళలకు ఎంతో మేలు

వేంపల్లె, మే 3: కాంగ్రెస్ వస్తే మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని, ఒక్కో మహిళలకు నెలకు రూ.8333 ఇస్తారని, ఏడాదికి లక్ష రూపాయల చొప్పున ఐదేళ్లకు ఐదు లక్షలు కుటుంబంలోని మహిళ ఖాతాలో జమ అవుతుందని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, పులివెందుల కాంగ్రెస్ అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డి, వైఎస్ వివేకా అల్లుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె, కుమ్మరాంపల్లె, వీరన్నగట్టుపల్లె గ్రామాలలో వారు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నిర్భయంగా ఓటేయండి: సీఐ



ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలకు సూచనలిస్తున్న సీఐ మద్దిలేటి

పులివెందుల, మే 3: ఈనెల 13న జరిగే ఎన్నికలలో ప్రతి ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పులివెందుల రూరల్ సీఐ మద్దిలేటి, ఇన్‌స్పెక్టర్ శంకరనాయక్, తొండూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం స్పెషల్ పార్టీ పోలీసులచే తొండూరు, ఇనగలూరు, సంతకొవ్వూరు, గంగనపల్లె, ఊడవగండ్ల గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజలనుద్దేశించి ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కౌసల్య దేవి పరిణయ పారాయణం



దశరథ మహారాజు దేవస్థానంలో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

చక్రాయపేట, మే 3: ఆంధ్ర అయోధ్య రాయచోటి-వేంపల్లె మెయిన్ రోడ్డు నాగులగుట్టపల్లె, దేవరగుట్టపల్లె మధ్యలో వెలసిన శ్రీరాముని తల్లిదండ్రులైన కౌసల్య, సుమిత్ర, కైకేయి, దశరథ మహారాజుస్వామి దేవస్థానంలో కౌసల్య దేవి పరిణయం పారాయణం శనివారం నిర్వహించారు. దశరథ మహారాజుస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. భక్తులకు అశేషంగా పాల్గొన్నారు. భాగవత ఉత్తములు గొందిపల్లె నారాయణరెడ్డి, ఓబయ్య, రాజు, రంగనాథ, ఆలయ ధర్మకర్త సోమ రామసుబ్బయ్య, దేవస్థాన కమిటీ చైర్మన్ సుబ్బరామయ్య, సోము చంద్రశేఖర్ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు



గాయాలపాలైన ఖలీల్

వీరపునాయునిపల్లె, మే 3: మండలంలోని ఉరుటూరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఉరుటూరు గ్రామం వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఖలీల్ తన వాహనం స్కిడ్ అయి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. కిందపడిన ఖలీల్ స్పృహకోల్పోవడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు 108కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళా ఉద్యోగులకు సమీపంలో ఎన్నికల విధులు కేటాయించాలి

రాయచోటిటౌన్, మే3: 2024 సాధారణ ఎన్నికల్లో మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయులను సమీప నియోజకవర్గంలోనే ఎన్నికల విదులు కేటాయించాలని, పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని యూటీ ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు జిల్లా ఎన్నికల అధికారిని కోరారు. అన్నమయ్య జిల్లాలో ఓపీవో బాధ్యతలు కేటాయించే సందర్భంలో మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయులను 150 నుంచి 200 కిలోమీటర్ల దూరంలో విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ముఖ్యంగా కోడూరు నియోజకవర్గం నుంచి బీ. కొత్తకోటకు, తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాల నుంచి రైల్వేకోడూరు నియోజకవర్గంలో విదులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం ఇబ్బందికరమన్నారు. మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయులను వారు పనిచేస్తున్న నియోజకవర్గానికి సమీప నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించేలా ఉత్తర్వులు సవరించిన అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్లు వారు తెలిపారు. ఇదే సందర్భంలో కొంత మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు అన్నమయ్య జిల్లాలో పని చేస్తున్నప్పటికీ వారి ఓటు ఇతర జిల్లాల్లో ఉన్నందున వారి పోస్టల్ బ్యాలెట్ ఉపయో గించుకోవడానికి రాయచోటిలోనే ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు వారు పనిచేస్తున్న లేదా వారి ఓటు హక్కు ఉన్న నియోజకవర్గంలో తమ పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునే విధంగా అవకాశం ఇవ్వాలని, మే 5వ తేదీతో పాటు 6వ తేదీన కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నందలూరులో పోలీసు కవాతు

నందలూరు, మే 3: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని, ప్రజలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. శుక్రవారం కేంద్ర బలగాలతో స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి నందలూరు గ్రామ పంచాయతీలోని సౌమ్యనాథస్వామి ఆలయం వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా ప్రజలకు భద్రత కల్పించడానికి ఈ పోలీసు కవాతు నిర్వహించినట్లు తెలియజేశారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

పొడదుప్పిపై కుక్కల దాడి

సిద్దవటం, మే3 : కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నేకనాపురం గ్రామంలోకి వచ్చిన పొడదుప్పిపై శుక్రవారం ఉదయం కుక్కలు దాడి చేశాయి. గ్రామస్తులు శునకాల దాడి నుండి వన్యప్రాణిని కాపాడి కడపకు చెందిన అటవీ శాఖ రేంజ్ అధికారి ప్రసాద్‌కు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారి వెంటనే వారి సిబ్బందిని పంపించి గాయపడ్డ పొడదుప్పిని భాకరాపేట పశువైద్యశాలలో చికిత్స అందించి ఆ వన్యప్రాణి అడవిలో క్షేమంగా వదిలేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది నేకనాపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కరెంటు కోతతో అవస్థలు

పెనగలూరు, మే3 : పెనగలూరు మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటలవరకు నిరంతరాయంగా కరెంటు కోత విధించడ ంతో ప్రజలు తిప్పలు పడ్డారు. నిరంతరాయంగా ఆరు గంటల కరెంటు కోతతో తాగునీటి మోటార్లు స్తంభించిపోయాయి. ఫలితంగా నీళ్లకోసం జనాలు తల్లడిల్లిపోయారు. ఇదిఇలా ఉండగా రెండు మూడు రోజుల నుంచి తీవ్రమైన ఎండల వల్ల భరించలేని ఉక్కపోతతో ఈ ఆరుగంటల సమయంలో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో సమగ్రాభివృద్ధి

- కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి





ప్రొద్దుటూరులో వరదరాజులరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న భూపేష్‌రెడ్డి... మైలవరంలో ఆదినారాయణరెడ్డితో ప్రచారం

కడప, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు అయితే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, అయితే కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేందుకు ఎన్డీయే కూటమి అభ్యర్థులైన సైకిల్, కమలం గుర్తులపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లె గ్రామంలో ప్రొద్దుటూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, మైలవరం మండలంలో జమ్మలమడుగు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డిలతో కలిసి భూపేష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం దివాళా తీసిందన్నారు. సొంత జిల్లా కడపకు జగన్ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. మూడేళ్లలో స్టీల్ ఫ్యాక్టరీని పూర్తిచేస్తానని రెండుసార్లు కొబ్బరికాయ కొట్టారు. ఇంత వరకు కనీసం కాంపౌండ్ కూడా పూర్తిచేయలేదన్నారు. కొప్పర్తిలో పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని నిరుద్యోగుల్లో ఆశ పెంచారన్నారు. పరిశ్రమలు పూర్తికావాలన్నా, స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరగాలన్నా కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు వస్తేనే సాధ్యమవుతున్నారు. మళ్లీ జగన్ వస్తే ఆస్తులను లాక్కుంటాడన్నారు. ఇప్పటికే వైసీపీ బ్యాచ్ అంతా జిల్లాలో సహజవనరులను కొట్టేసిందని, జనం స్వేచ్ఛగా బతకాలంటే ఎన్డీయే కూటమి రావాలన్నారు.

'సదస్సును జయప్రదం చేయండి'

కడప (ఎర్రముక్కపల్లె), మే 3 : పరకాల ప్రభాకర్ సదస్సు ఈ నెల 4న జరగనుందని, జయప్రదం చేయాలని ఏపీ సిటిజన్ ఫోరం జిల్లాశాఖ కన్వీనరు ఓబుల్‌రెడ్డి, కోకన్వీనరు లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ శంకరాపురం ఐఎంఏ హాలులో నిర్వహించనున్న 'దేశ ఆర్థిక పరిస్థితి-మన భవిష్యత్తు' అన్న అంశంపై నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోండి

జమ్మలమడుగు, మే 3: ఈనెల 5, 6తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవాలని జమ్మలమడుగు సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కరుణాకర్ తెలిపారు. జమ్మలమడుగులోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆయన శుక్రవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

మదనపల్లి అర్బన్ మే 3 : ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నట్లు మదనపలి సీఐ శేఖర్ తెలిపారు. మదనపలి మండలం వేంపల్లి పంచాయతీ కస్పాకు చెందిన బయన్న గారి సతీష్(49) శుక్రవారం ఉదయం ఇంట్లో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఇతను బెంగళూరులో ప్రైవేట్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నారని, ఐతే షేర్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఈఎంఐ కట్టలేక బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 1న బెంగళూరు నుంచి మదనపలి మండలం వేంపల్లికి వచ్చి, ఆర్థిక ఇబ్బందుల గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. శుక్రవారం ఉదయం ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో తాడుతో ఫైపునకు ఉరేసుకున్నారు. విషయం తెలుసు కున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే అతను మృతి చెందడంతో మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మదనపలి రూరల్ సీఐ శేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమయపాలనతో అధిక ఆదాయం

మదనపల్లె అర్బన్, మే3: సమయపాలనతో అధిక ఆదాయం సాధ్యమని మదనపల్లె వన్‌డిపో మేనేజరు మూరే వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డిపోలో గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో వన్ డిపో ఆదాయం రూ. 567, 33 లక్షలు సాధించిందన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు మనోహర్‌నాయుడు

కమలాపురం రూరల్, మే 3: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మనోహర్ తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలంటే టీడీపీ, టీడీపీ అంటే బీసీలనే నమ్మకం ఉందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. అనంతరం చంద్రబాబునాయుడు సీఎం అయినప్పటి నుంచి బీసీలకు అధిక ప్రాధాన్యతని స్తున్నారన్నారు. సబ్సిడీ లోన్లు, విదేశీ ఉన్నత విద్య, పెళ్లి కానుక, కులవృత్తులకు సబ్సిడీ లోన్లు, ఉచితంగా పనిముట్లు పంపిణీ చేశారని, అదే విధంగా బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు కూడా ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధికి తోడ్పడారన్నారు. అన్నివిధాలుగా బీసీలను ఆదుకున్నది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలందరూ గంప గుత్తగా టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవరెడ్డి, శంకర్ యాదవ్, గండి నారాయణ, దాది రామయ్య, రెడ్డి కరీం పాల్గొన్నారు.

'జగన్‌ను ఓడిద్దాం.. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందాం'

కడప (మారుతీనగర్) మే 3: దళిత, బహుజనులకు తీరని అన్యాయం చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడిద్దాం, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందాం అని దళిత వేదిక రాష్ట్ర కన్వీనర్ కడప రెడ్డన్న పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో దళిత, గిరిజనుల అభ్యున్నతికై కేంద్రం ద్వారా అందే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను జగన్‌రెడ్డి నవరత్నాలకు దారి మళ్లించడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీల నోట్లో మట్టికొట్టిన జగన్‌రెడ్డికి ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. నవరత్నాల పేరుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను జగన్‌రెడ్డి దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, ప్రధాన కార్యదర్శి జయరాజు, కార్యదర్శి పుల్లయ్య, నాయకులు శివకుమార్, నారాయణ, శివప్రసాద్, లక్ష్మణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్తార్, లోక్ సత్తా పార్టీ నాయకులు దేవర శ్రీకృష్ణ పాల్గొన్నారు.

అధిక ధరలతో నిలువు దోపిడీ

పులివెందుల టౌన్, మే 3: వైసీపీ హయాంలో అధిక ధరలతో ప్రజలను నిలువు దోపిడీ చేశారని, అందుకే టీడీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు అందరు తమ ఓటును టీడీపీకి వేసి అసెంబ్లీ అభ్యర్థిగా మారెడ్డి రవీంద్రనాథరెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

రాష్ట్రానికి చంద్రన్న వెలుగులు కావాలి

- టీడీపీ కమలాపురం అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి
- చెన్నూరులో ఉప్పొంగిన యువచైతన్యం
- వెయ్యి బైకులతో భారీ ర్యాలీ



చెన్నూరులో పుత్తా చైతన్యరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన గోర్ల శివారెడ్డి, ప్రవీణ్, రియాజ్ తదితరులు, పెండ్లిమర్రిలో పార్టీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, మే 3: చెన్నూరులో యువ చైతన్యం ఉప్పొంగింది. దాదాపు వెయ్యి ద్విచక్ర వాహనాలతో రెండు కి.మీ. మేర భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పొడవునా 'సైకో పోవాలి, సైకిలు గెలవాలి, చైతన్యరెడ్డి జిందాబాద్, భారీ మెజార్టీతో గెలిపించుకుందాం, టీడీపీ జిందాబాద్' అనే నినాదాలతో చెన్నూరు హోరెత్తింది. శుక్రవారం కమలాపురం నియోజకవర్గ వైసీపీ యువజన శాఖ విభాగం అధ్యక్షుడు గోర్ల పుల్లయ్యగారి శివారెడ్డి తన పదవికి రాజీనామా చేసి శుక్రవారం పార్టీలో చేరడంతో ఆయన వెంట యువత పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ పుత్తా చైతన్యరెడ్డికి బ్రహ్మరథం పట్టారు. అనంతరం చెన్నూరు కేఓఆర్ కాలనీ (యల్లమ్మదేవాలయం వద్ద) ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ అభ్యర్థి మాట్లాడుతూ రాష్ట్రానికి మబ్బులు పట్టాయని, చంద్రన్న వెలుగులు వస్తేనే ఆ మబ్బులు తొలగి రాష్ట్రం బాగు పడుతుందన్నారు. ఈ ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశాడన్నారు. బీజేపీపై ముస్లిం మైనార్టీలు ఎలాంటి అపనమ్మకం పెట్టుకోవద్దని, ఆ పార్టీతో కలిసి ఉన్న సమయంలో హజ్‌హౌస్ నిర్మించామని, దుల్హన్, రంజాన్ తోఫా అందజేశామని గుర్తు చేశారు.

వైసీపీలో బోడిగుండే..

వైసీపీ ప్రభుత్వంలో ఎంతో మేలు జరుగుతుందని భ్రమపడి ఆ పార్టీకి వెళ్లానని, ఇప్పుడు వాడుకుని బోడిగుండు కొట్టించారని పార్టీలో చేరిన యువనేత గోర్ల పుల్లయ్యగారి శివారెడ్డి అన్నారు. అందుకే కమలాపురం నియోజకవర్గంలో పుత్తా చైతన్యరెడ్డిని ఐదువేల మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు. కాగా యువనేత ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ చెన్నూరులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాలీ పొడవనా అభ్యర్థి చైతన్యరెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ విక్టరీ సింబల్ చూపించారు.

వంద కుటుంబాలు చేరిక

యువనేత శివారెడ్డిని పుత్తా చైతన్యరెడ్డి టీడీపీలోకి కండువావేసి ఆహ్వానించగా, ఆయన సారథ్యంలో యువనేతలు ప్రవీణ్, రియాజ్ ఆధ్వర్యంలో దాదాపు వంద మంది యువతతో పాటు ముస్లిం మహిళలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో యువనేత పుత్తా లక్ష్మీరెడ్డి, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, బలిజ సంఘం జిల్లా నాయకుడు ఆకులప్రసాద్‌బాబు, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మైనార్టీ జిల్లా నాయకులు షబ్బీర్‌హుసేన్, నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజాహుసేన్, జిల్లా అధికార ప్రతినిధి అక్బర్, తెలుగు యువత జిల్లా కార్యదర్శి పవన్, బీసీ సంఘం అధ్యక్షుడు ఆటో బాబు, కుందేటి క్రిష్ణయ్య, యువనేత గుగ్గిళ్ల చాణిక్య, నీలం గోవిందరెడ్డి, ముండ్ల శ్రీనివాసులరెడ్డి, అల్లాడు రాజశేఖర్‌రెడ్డితో పాటు మండల వ్యాప్తంగా పలువురు నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీని ఆదరిస్తే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

టీడీపీని ఆదరిస్తే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతాయని రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు లేవాకు శివారెడ్డి, లేవాకు విజయ ప్రతాప్‌రెడ్డి, విజయభాస్కర రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి టీడీపీని గెలిపించాలని ప్రచారం చేశారు.

ప్రచారంలో పుత్తా కుటుంబ సభ్యులు

కమలాపురం రూరల్, మే 3: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు టీడీపీ పాలన కోసం ఎదురు చూస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్యరెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 4, 12, 13 కౌన్సిలరు పరిధిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో పుత్తా శివమ్మ, దివ్యశ్రీ పుత్తా హరిత, శ్వేత పాల్గొన్నారు. వారికి టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, నరసింహారెడ్డి, దివాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, దర్మారెడ్డి, బోవిళ్ల శంకర్‌రెడ్డి, రామమునిరెడ్డి, దాది రామయ్య, ఎన్టీఆర్ రమణ, కరీముల్లా, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

సీకేదిన్నె: రాష్ట్రంలో టీడీపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని పుత్తా నరసింహారెడ్డి అల్లుడు యశ్వంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇప్పెంట పంచాయతీ రాజులతాతయ్యగారిపల్లె గ్రామం ఏఎల్ కాలనీలో టీడీపీ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, క్రిష్ణకిశోర్‌రెడ్డి, భద్ర, సుబ్బనరసయ్య, రెడ్డిబాష, జబీవుల్లా, రాజా, వెంకటసుబ్బయ్య, దర్బార్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లెలో పంచాయతీలోని సోగలపల్లెలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో చింతకుంట శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి పుత్తా నరసింహారెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, రామాంజనేయరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాళ్లపల్లె శ్రీనివాసులరెడ్డి, రఘు, అయ్యవారురెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మండలంలోని నందిమండలం గ్రామంలో పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టో పథకాలను వివరించారు.

వీరపునాయునిపల్లె: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును సీఎంను చేయాలని కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గంగిరెడ్డిపల్లె, బుసిరెడ్డిపల్లె గ్రామాలలో మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డిపల్లె పోలీస్ రాజ అధ్యక్షతన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


విద్యుత్తు సమస్యలపై తక్షణమే స్పందించాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ


సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఎస్.రమణ

జమ్మలమడుగు, మే 3: ప్రజలకు ఎక్కడ విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ఉన్న చోట తక్షణమే స్పందించి కరెంటు సమస్యలు రాకుండా చూడాలని ఉమ్మడి వైఎస్ఆర్‌జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ ఆదేశించారు. శుక్రవారం జమ్మలమడుగులోని కోవెలకుంట్ల రోడ్డు శ్రీ రంగనాథస్వామి ఫంక్షన్ హాలులో విద్యుత్తు అధికారులకు సమావేశం నిర్వహించారు. జమ్మలమడుగు, ముద్దనూరు, మైలవరం, పెద్దముడియం మండలాలకు సంబంధించిన విద్యుత్తు శాఖ అధికారులతో సమావేశమై వారికి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం దేవుడు ఇచ్చాడని, విద్యుత్తు సంస్థ తరపున ప్రజలకు విద్యుత్తు అధికారులు, సిబ్బంది సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని పనులు పూర్తి చేస్తే ఫలితాలు ఉంటాయన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, ఒక క్షణం కరెంటు పోయినా ప్రజలు భరించే స్థితిలో లేరని, అందుకు విద్యుత్తు సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. కరెంటు లేకున్నా గ్రామాల్లో, పట్టణాల్లో నీటి సమస్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఎక్కడా లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా ఆయా ప్రాంతాల్లో సిబ్బంది పనులు చేయాలన్నారు. ప్రస్తుతం విద్యుత్తు అంతరాయాలు అధికంగా ఉన్నాయని, అధికారులకు చెప్పినా స్పందించని వారిపై చర్యలు తప్పవన్నారు. విద్యుత్తు సిబ్బంది లైన్లలో తిరిగి సమస్యలు గుర్తించాలన్నారు. ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్తు చౌర్యాన్ని అరికట్టి వాలిపోయిన స్తంభాలను లూజు లైన్లను సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజగోపాల్, ఏఏవో రాధమ్మ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు


పుష్పగిరి క్షేత్రం

వల్లూరు, మే 3: దక్షిణ కాశిగా పేరొందిన పుష్పగిరి క్షేత్రంలో వెలసిన కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, లక్ష్మి చెన్నకేశవ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వ తేది నుంచి 14వ తేది వరకు నిర్వహిస్తున్నామని ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, ఈవో శ్రీనివాసులు, ఆలయ అర్చకులు అఖిల్‌దీక్షితులు తెలిపారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. కొండపైన క్షేత్రపాలకుడు శ్రీలక్ష్మి చెన్నకేశస్వామి, సంతాన మల్లేశ్వరుడు ఒకే ప్రాకారంలో వెలసి భక్తులకు దర్శనభాగ్యం కలగజేస్తున్నారని తెలిపారు. పుష్పగిరి క్షేత్రాన్ని దక్షిణ కాశిగా, భూలోక వైకుంఠంగా పేర్కొంటారని, ఇక్కడ పంచమ నదులు కొలువై ఉంటాయన్నారు. వైశాఖ శుద్ధ తదియ (అక్షయ తృతీయ) నాడు పెన్నానదిలో సంకల్ప పూర్వకంగా తీర్థస్నానాలాచరించి శివకేశవులను దర్శించిన వారికి 100 మార్లు అశ్వమేధ యాగాన్ని చేసిన ఫలితం కలుగుతుందన్నారు. స్వామివార్లకు వివిధ సేవలతో పాటు వైద్యనాథేశ్వర, లక్ష్మి చెన్నకేశవస్వామి వార్లకు వివిధ వాహనాల్లో గ్రామోత్సవ నిర్వహణ ఉంటుందన్నారు.

ఉత్సవ వివరాలు : ఈ నెల 5న ఆదివారం వైద్యనాథేశ్వరుడు, లక్ష్మీచెన్నకేశవస్వామికి అంకురార్పణ, 6న సోమవారం రాత్రి 7గంటలకు ధ్వజారోహణం, హంస వాహన సేవ, అనంతరం తిరుచ్చి వాహనసేవ ఉంటుందని, 7న మంగళవారం రాత్రి సింహవాహనంపై వైద్యనాథేశ్వరుడు, అనంతరం హంసవాహనంపై లక్ష్మి చెన్నకేశవులు, 8న రాత్రి పురుషాన్ మృగవాహనంపై వైద్యనాథేశ్వరుడు, రాత్రి 8గంటలకు కొండపైన కలశ వాహనం, గ్రామోత్సవం, 9న రాత్రి వైద్యనాథేశ్వరుడికి మయూర వాహనం, అనంతరం చందనాలంకారం, హనుమత్‌వాహనంపై చెన్నకేశవుని గ్రామోత్సవం ఉంటుందన్నారు. 10న నందివాహనంలో వైద్యనాథేశ్వరుడు, అదే రోజు ఉదయం పూలంగిసేవ, రాత్రికి గరుడ వాహనంపై గ్రామోత్సవం, 11న శనివారం ఉదయం శ్రీకామాక్షి సమేత వైద్యనాథేశ్వరునికి ఉదయం కల్యాణోత్సవం, రాత్రికి గజవాహనంపై గ్రామోత్సవం, అనంతరం శ్రీలక్ష్మి చెన్నకేశవ కల్యాణం, రాత్రికి గజవాహనంపై గ్రామోత్సవం, 12న ఉదయం వివిధ పూజలు, హోమాలు అనంతరం వైద్యనాథేశ్వర రథోత్సవం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. 13న సోమవారం రాత్రి 7 గంటలకు వైద్యనాథేశ్వరుడు, చెన్నకేశవులకు అశ్వవాహన సేవ ఉంటుందని తెలిపారు. అదేవిధంగా 14న మంగళవారం ధ్వజావరోహణం, చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి పుష్పయాగం ఉంటుందని, రాత్రికి తిరుచ్చివాహనం ఉంటుందన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం వివిధ హోమాలు, జపాలు, స్నపన తిరుమంజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు స్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తరించాలని కోరారు.


పుష్పగిరి కొండపైన వెలసిన చెన్నకేశవస్వామి, లక్ష్మి అమ్మవారు, సంతాన మల్లేశ్వరుడు

గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థి


మహమ్మద్‌నబీ ఆజాద్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్నడైరెక్టర్ గుప్త తదితరులు

వేంపల్లె, మే 3: మల్టీ నేషన్ సంస్థ అయిన గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్ ప్రోగ్రాంకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థి షేక్ మహమ్మద్‌నబీ ఆజాద్ ఎంపికయ్యారు. ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ 3వ సంవత్సరం చదువుతున్న ఆ విద్యార్థి సుమారు 350 గంటలు కష్టపడి ఈ అరుదైన ప్రతిభ సాధించాడని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్త పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు ఈ విద్యార్థి పనిచేస్తారని తెలిపారు. రూ.2.50 లక్షల స్టైఫండ్ గూగుల్ సంస్థ నుంచి అందుకున్నందుకు ఆ విద్యార్థిని అభినందించారు. డైరెక్టర్ గుప్త, హెచ్‌ఓడి రవి, అకడమిక్ డీన్ రత్నకుమారి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ వినోద్ ఇతర అధ్యాపకుల సహకారంతో ఈ అవకాశం లభించిందని ఈ విద్యార్థి తెలిపారు.

ఇన్నోవా కారు -బైకు ఢీ - వ్యక్తి మృతి

కొండాపురం, మే 3: మండలంలోని వెంకటాపురం గ్రామం సమీపంలో ఇన్నోవా కారు, బైకు ఢీకొన్న సంఘటనలో శుక్రవారం శివశంకర్ అనే వ్యక్తి మృతి చెందాడు. ముద్దనూరు మండలం ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన కె.శివశంకర్ తన భార్యతో కలిసి స్వగ్రామానికి బైకులో వెళ్తుండగా ఎదురుగా ఇన్నోవా కారు వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో శివశంకర్ అక్కడికక్కడే మృతిచెందగా, అతని భార్యకు గాయాలయ్యాయి. ఈమెను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు


నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్న పోలీసులు

కమలాపురం రూరల్, మే 3: నగర పంచాయతీ పరిధిలోని పక్కీరువీధిలో మంగళవారం తెల్లవారుజామున మహ్మద్‌బాషా అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసి కోర్టుకుహాజరు పరిచినట్లు సీఐ రామక్రిష్ణరెడ్డి, ఎస్ఐ రుషికేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వారు పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని పక్కీరువీధిలో నివాసం ఉంటున్న ఉస్మాన్ గని బాషా కుమారుడు మహ్మద్ బాషా అలియాస్ గని హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే క్రికెట్ విషయంలో చోటు చేసుకున్న ఘర్షణ హత్యకు దారి తీసిందని తెలిపారు. హత్య చేసిన వారు ఆ రోజు నుంచి పరారీలో ఉన్నారని, ప్రధాన నిందితులను శుక్రవారం పందిళ్లపల్లె గ్రామ సమీపంలో పోలీసు బృందాలు వెళ్లి పదిమంది యువకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండుకు తరలించారన్నారు.

దిగ్విజయంగా కేజీసెట్

సీకేదిన్నె, మే 3: కేజీసెట్ 2క24 దిగ్విజయంగా ముగిసినట్లు కేఎస్ఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం కళాశాలలు సంయుక్తంగా ఇంటర్ ఉత్తీర్ణులై ఇంజనీరింగ్ చేయాలనే విద్యార్థులకు నిర్వహించిన కేజీసెట్ గత మూడు రోజులుగా మంచి స్పందన లభించిందని, శుక్రవారం దిగ్విజయంగా 2,900 మంది హాజరై పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఎంసెట్ తరహాలో నిర్వహించే ఈ పరీక్ష వలన విద్యార్థులకు అవగాహన కలగడంతో పాటు కళాశాల అందించే సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకోవచ్చన్నారు. కళాశాలలో కల్పించిన వసతుల పట్ల పరీక్షకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ మదనమోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరప్రసాద్, కేఎల్ఎం ప్రిన్సిపల్ ఎంవీ రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ కిరణ్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెన్సరీ సీనియర్ ఆఫీసర్ నాగరాజు, 2క24 కన్వీనర్ కిశోర్‌కుమార్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


కేఎస్ఆర్ఎం కళాశాలలో కేజీసెట్‌కు హాజరైనవారు

అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

- క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్

పులివెందుల, మే 3: ప్రజారోగ్య పరిరక్షణలో అక్రమాలకు పాల్పడే ప్రైవేట్ ఆసుపత్రుల వ్యవహారశైలిని ఎంతమాత్రం సహించబోమని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.రమేష్ హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో తనిఖీలు మరిచారు అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ప్రైవేట్ ఆసుపత్రుల రెన్యువల్స్, రిజిస్ట్రేషన్లు తదితర అంశాలను తనిఖీ చేసేందుకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు ఉంటారని, క్రమానుగునంగా వారు తనిఖీలు చేస్తుంటారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రైవేట్ వైద్య సంస్థలలో కార్యకలాపాలను అనునిత్యం తనిఖీ చేస్తూనే ఉంటారని, ఎటువంటి అక్రమాలైన దృష్టికి వస్తే వాటిపై వెంటనే తగు చర్యలు తీసుకుంటారని వివరించారు. ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న కథనంపై ఆయన స్పందిస్తూ ఏపీ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏపీ ఏపీఎంసీఈ) యాక్ట్ 2002 నియమ నిబంధనలకు లోబడి ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేస్తుంటారని తెలిపారు. అదేవిధంగా ఫీజుల వివరాలను ప్రదర్శించని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా డీఎంహెచ్‌ఓలు, వారివారి బృందాలు 618 ప్రైవేటు ఆసుపత్రుల్ని తనిఖీ చేశారని డాక్టర్ రమేష్ వివరించారు. కడప జిల్లాలో 83 ప్రైవేట్ ఆసుపత్రుల్ని తనిఖీ చేశారని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద సిజేరియన్ చేసేందుకు ఓ ఆసుపత్రి తిరస్కరించిందన్న అంశంపై కడప జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ స్పందిస్తూ ఇందుకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని స్పష్టం చేశారు.


యువతి ఆత్మహత్య

సంబేపల్లె, మే 3: మండలంలోని దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెకు చెందిన షేక్‌నౌజియా(19) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు రాయచోటిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

చౌడేశ్వరి ఆలయానికి రూ.6.20 లక్షలు విరాళం

ప్రొద్దుటూరు, మే 3: ప్రొద్దుటూరు పట్టణం మేదరవీధికి చెందిన శ్రీరామలింగచౌడేశ్వరిదేవి ఆలయానికి అంపావతిన వీరప్రసాద్, పేరి గురుమూర్తి రూ.5.20 లక్షలు విరాళం అందజేశారు. శుక్రవారం స్థానిక మేదరవీధిలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఉట్టినాగశయనం, కార్యదర్శి గిద్దలూరు శ్రీనివాసులు సమక్షంలో వారు పై మొత్తాన్ని ఫిక్స్‌డ్ బాండ్ రూపంలో అందజేశారు. అలాగే కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి రూ.1 లక్ష విరాళం అందజేశారు. వీరందరికి ఆలయ కమిటీ తరపున సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు పోసా వెంకటలక్షుమయ్య, గిద్దలూరు ఈశ్వరయ్య, పూజరి రాఘవేంద్రలు పాల్గొన్నారు.

నన్నూ.. వదల్లేదేమన్నా..!



తెగిపోయి అనాథలా మారిన అన్నమయ్య ప్రాజెక్టు

నా పేరు పెట్టి మరో ఊరికి న్యాయం చేస్తివి ● నా పేరున ఉన్న డ్యాం తెంపేస్తివి
నా స్వగ్రామాన్ని మరిచితివి.. ● జగనన్నా.. నాపై ఎందుకన్నా అంత కోపం..
● అన్నమాచార్యుల ఆత్మఘోష..



రాజంపేట, మే3 : ఏడుకొండలవాడినే.. మెప్పించిన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులను కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వదల్లేదు. ఆయన పేరిట ఉన్న అన్నమయ్య ప్రాజెక్టును ఇసుక దాహంతో తెంచేయగా ఆయన స్వగ్రామం కలిగి ఉన్న ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేయకుండా ఆయనను మనోవేదనకు గురి చేశారు. అంతేకాక అన్నమయ్య స్వగ్రామం తాళ్లపాకకు తట్టెడు సిమెంటు సైతం వేయకుండా ఆ గ్రామాన్ని అభివృద్ధి నిరోధకంగా తయారు చేశారు. దీంతో అన్నమయ్య చెప్పుకుంటున్న ఆత్మఘోష ఇది..

అన్నా.. జగనన్నా..... నీవు నాకంటే ఎంతో చిన్నోడివన్నా.... నీకంటే నేను అనేక శతాబ్దాల పెద్దోడిని. ఏకంగా ఏడు కొండలవానికి హుండీనే పెట్టినోడిని. ఆయనపై 32 వేల కీర్తనలు రాసి ఈ జగత్తుకు తెలిసినవాడిని. ఒక్కసారి అవకాశమివ్వమని అధికారంలోకి వస్తివి. కలియుగంలోని నేటి హైటెక్ యుగంలో కూడా అందరినీ ముంచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినోడివి. ఆ విషయం ఆటుంచితే సాక్షాత్తు జగత్తుకు మూలపురుషుడైన వెంకటేశ్వరుడి చేతనే శభాష్ అనిపించుకుంటున్న నన్ను కూడా వదలకపోతివి. నేనేదో.. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామిపై కీర్తనలు రాసి ఆనాటి నుంచి నేటి వరకు కీర్తింపబడుతున్నా నన్ను ఎందుకూ కొరగాకుండా చేస్తివి.. ఊరూ.. వాడా తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన కూడళ్లలో నా ప్రతిమలు పెట్టుకోని ఊరు లేదు. అటువంటి నా గొప్పను ఒక్కసారిగా ఎందుకూ కొరగాకుండా చేస్తివి. నేను నా స్వగ్రామం తాళ్లపాకలో నా ప్రజల మధ్య వందల ఏళ్లగా ఉంటూ నాపేరిట అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటుంటిని.. నా గొప్పత నాన్ని మెచ్చిన... నాటి రాష్ట్ర పెద్దలు నా పేరుతో ఓ ప్రాజెక్టుకు రూపకల్పన చేశా రు. రాజంపేట, పుల్లంపేట మండలాల్లోని 22,500 ఎకరాలకు సాగునీరు అందుతూ ఏడాదికి రెండు పంటలు పుష్కలంగా పండేవి. ఏడు చెరువులకు మూడుకార్లకు కావాల్సిన నీరందేది. చుట్టుపక్కల వందల గ్రామాలకు తాగునీరు కావాల్సినంత అందేది.

నీవు అధికారం చేపట్టిన తరువాత నీ కన్ను అభం శుభం తెలియని నాపై పడింది. ఏదో దేవుడిపై చక్కని సంకీర్తనలు రాసి ఆయన మెప్పు పొంది ఎప్పుడో నేను వైకుంఠం చేరి నా ప్రాంతీయులను నెమరు వేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో పరలోకంలో ప్రశాంతంగా ఉన్న నన్నూ వదలకపోతివి. నేను చేసిన ద్రోహమేమో కానీ నా పేరిట ఉన్న అన్నమయ్య ప్రాజెక్టును నీ వందిమాగదులు నీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్షల ట్రాక్టర్ల ఇసుక దోపిడీ చేసి కోట్లు గడించ పన్నాగం పన్నితిరి. రెండున్నరేళ్ల కిందట భారీ వర్షాలు పడుతుండగా నా డ్యాంలో కావాల్సినంత నీరు ముందుగానే ఉండగా ఆ నీటిని వదిలేయక మీ అనుయాయుల ఇసుకలారీలను కాపాడుకోవడానికి గేట్లు ఎత్తి నీటిని వదలలేదు. ఆ నీటిని కిందకి పంపితే కోట్లు కొల్లగొట్టడానికి పనికివచ్చే నీ ఇసుక లారీలు కొట్టుకుపోతాయని అధికారమదం తలకెక్కిన మీ దు రహంకారానికి నా ప్రాజెక్టు ఆనవాళ్లే లేకుండా తెగిపోయింది. తెగితే.. తెగింది కదా కింద 40 మంది పైబడి అమాయకులు ఆ నీటి వెల్లువలో కొట్టుకు పోతిరి. రాజంపేట, పెనగలూ రు, నందలూరు మండలాల పరిధిలోని చెయ్యేరు నదీపరివాహక ప్రాంతాల్లోని సుమారు 40 గ్రామాల వారు ఆ డ్యాం నీటితో సర్వనాశన మైతిరి. ఉన్న పంట పొలాలు, ఇసుక మేటల పాలయ్యాయి. సుమారు 500 కుటుంబాల ఇళ్ల వరదల్లో కొట్టుకుపోగా నాటి నుంచి నేటికీ వారికి ఒక ఇల్లు కట్టించకపోవడంతో ఎండకు, వానకు, తడుస్తూ విషపురుగులతో సావాసం చేస్తూ ఈ ప్రాంతం వద్దురా బాబో.. అంటూ అనేక మంది అభాగ్యులు ఊర్లకుఊర్లే ఇతర ప్రాంతాలకు వలస పోతిరి. వందల ఎకరాల భూముల్లో వేసిన ఇసుక మేటలను తొలగించకపోవడంతో భూములు వ్యవసాయానికి పనికిరాక రైతులందరూ అన్నమో.. రామచంద్రా అని అలమటిస్తిరి. వందల గోమాతలు, గేదెలు, ఎద్దులు, మేకలు అంబా.. అంబా... అంటూ అరుస్తూ వరదనీటిలో కొట్టుకుపోయినవి. ఇందులో నష్టపోయిన ఒక్క రైతునూ ఆదుకోకపోతివి. ఒక్క కుటుంబానికి ఇల్లు కట్టించి వారికి నివాస యోగ్యాలు చూపించకపోతివి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోతివి.. సరికదా... తెగిపోయిన డ్యాంను రూ.800 కోట్లతో పునర్ నిర్మిస్తామని ప్రగల్భాలు పలికి, టెండర్లు పిలిచినట్లు నాటకాలు ఆడి కనీసం ఆ పనికి శంకుస్థాపన కూడా చేయకపోతివి. ఇలా నా బిడ్డలను నన్ను, సర్వనాశనం చేసిన నీకు నా ఆత్మఘోష ఎందుకు తగలకపోదూ.. ఈ బాధలో నేనుంటే మమ్ములను ఆదుకోకపోగా నా ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసి తీరా అధికారమదంతో పుండుమీద కారం చల్లినట్లు డ్యాం తెగిపోయి సర్వం కోల్పోయిన మాకు తిరిగి జిల్లా కాకుండా చేసి నా పేరున ఆ జిల్లాకు పెట్టి నా ప్రాంతీయులను, నన్ను మరొకసారి ఘోరంగా అభాసుబాలు చేస్తివి.. అన్నమయ్య జిల్లా, అన్నమయ్య డ్యాంలను నీ పుణ్యమా అని లేకుండా చేస్తివి. కనీసం నా గ్రామంలో నేను పుట్టిన గడ్డలో నా పూర్వీకులు ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద కూడా పెచ్చులూడుతుండే పిడికెడు సిమెంటు వేయకపోతివి... నిత్యం సంకీర్తనాగానం జరిగే నా ప్రాంతంలో కనీసం ధ్యానమందిరం కూలిపోతుంటే నేటికీ చూస్తూ ఉంటివి.. నా స్వగ్రామం తాళ్లపాకను ఏ అభివృద్ధీ లేకుండా చేస్తివి.. గ్రామంలో నాలుగు రోడ్లు, సంకీర్తనా కళాశాల అని, ఉద్యానవనాలని, నిత్యం నగర సంకీర్తన అని, తిరుమల రీతిలో తాళ్లపాకను అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మీ పార్టీ నేతల మాటలు గాలిలో కలిసి నోటి మాట రాక నేను, నా ప్రజలు మూగచ్చవంతో నిస్సహాయుల మైతిమి.. నేటి ఎన్నికల్లో నీవు చేసిన ద్రోహాలకు మా ప్రాంతీయుల, నా ఆత్మఘోష ఎందుకు తగలకపోదో.. జగనన్నా..

- ఇదీ అన్నమయ్య ఆత్మఘోష



అన్నమయ్య ప్రాజెక్టు తెగడంతో వేసిన ఇసుకమేటలను తొలగించని దృశ్యం



తాళ్లపాకలో కూలేందుకు సిద్ధంగా ఉన్న అన్నమయ్య ధ్యానమందిరం



అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో విగత జీవులైన దృశ్యం (ఫైల్ ఫొటో)

ఈ ఓట్ల కథ తెలుసా...



కడప (ఎర్రముక్కపల్లె), మే 3: ఓటు వజ్రాయుధం, ప్రజాస్వామం మనుగడను శాసించేది ఓటు. భారత ప్రభుత్వం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కులమత లింగ బేధం లేకుండా ఓటు హక్కు కల్పించింది. ఆ ఓటును వివధ రకాలుగా ఎన్నికల్లో వేసి తమకు నచ్చిన వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటారు. ఒక్క ఓటుకు ఒక్కో ప్రత్యేకత ఉంది.

సాధారణ ఓటు

18 ఏళ్లు నిండిన భారత పౌరుడు ఓటు హక్కును కలిగి ఉంటాడు. ఫారం6ను పూర్తి చేసి ఆధార్, రేషన్‌కార్డు, నివాస ధృవపత్రాలు చూపిస్తే ఓటు హక్కు లభిస్తుంది. దీనిని సాధారణ ఓటు అంటారు. సాధారణ ఓటు పోలింగ్ రోజున ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి వేస్తారు. అత్యధికులు ఇదే పద్ధతిలో ఓటు వినియోగించుకుంటారు.

పోస్టల్‌బ్యాలెట్



ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు సాధారణ ఓటర్లై ఉంటారు. వారిని ఎన్నికల విధులకు నియమిస్తే పోలింగ్ రోజు తమ ప్రాంతంలో ఓటు వేసే అవకాశం ఉండదు. అందువల్ల వారు ముందస్తుగానే ఫారం12 నింపి తమ ఎన్నికల ఆదేశాలు ఆధార్ జిరాక్స్‌లతో రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేస్తారు. వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు అందిస్తారు. గతంలో పోస్టుద్వారా పంపించేవారు. ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగానికి నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేష్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కడప ప్రధాన జిల్లా కేంద్రంలోనూ వివిధ మండల కేంద్రాల్లోనూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసే అవకాశాన్ని కల్పించారు.

ప్రాక్సి ఓట్‌ఫర్ సీఎస్‌వీ



దేశ భద్రతా విధుల్లోఉన్న సైనికుల కోసం ప్రత్యేకంగా ప్రాక్సిఓటు విధానం ఏర్పాటు చేశారు. సైన్యంలో విధులు నిర్వహించేవారు ఓటు వేయడానికి రాలేని పరిస్థితి. అందువల్ల వారికి క్లాసిఫైడ్ సర్వీసు ఓటు అందిస్తారు. వారి తరపున పీఎస్‌వీ అనుమతి పొందిన వ్యక్తి వచ్చి పోలింగ్ బూత్‌లో ఓటు వేయవచ్చు. లేదా క్లాసిఫైడ్ ఓటరు సర్వీసు తరపున తాము వేయడానికే వచ్చిన వారిని ప్రాక్సీఓటరు అని, అతని ఓటును ప్రాక్సీ ఓటు అని అంటారు

ఛాలెంజ్ ఓటు

ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని అతను నిజమైన ఓటరు కాదని పోలింగ్ ఏజంటు అభ్యతరం చెప్పి ఛాలెంజ్ చేస్తారు. పోలింగ్ ఏజంటు వద్ద రూ.2 ఫీజు కట్టించుకుంటారు. పోలింగ్ ఏజంటు ఇచ్చిన వ్యక్తి వాదనలు విన్న పీఓ గుర్తింపు కోసం బీఎల్ఓ ఇతర ఓటర్ల ద్వారా నిజమైన ఓటరా కాదా అని నిర్ధారించుకుంటారు. నిజమైన వ్యక్తి అయితే ఓటింగ్‌కు అనుమతి ఇస్తారు. కాకుంటే పోలీసులకు అప్పగించి పోలింగ్ ఏజంటు కట్టిన ఫీజు అతనికి తిరిగి ఇస్తారు. ఛాలెంజ్ ఓటు వేసిన వ్యక్తి వివరాలు ఫారం 14లో నమోదు చేస్తారు.

ఇంటి నుంచి ఓటు



85 ఏళ్లు దాటిన వృద్ధులకు దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసుకునే అవకాశాన్ని ఈదఫా ఎన్నికల కమిషన్ కల్పించింది. నిబంధనల మేరకు ఇళ్ల వద్ద వీరంతా ఓటు వేయాల్సి ఉంటుంది.

టెండరు ఓటు

ఇది ప్రత్యేక ఓటు. వేయడానికి వచ్చిన వ్యక్తి ఓటు అప్పటికే ఎవరో వేసి ఉంటే ఈ ఓటును నిబంధనల ప్రకారం ప్రిసైడింగ్ ఆఫీసరు జారీ చేస్తారు. తాను రాకుండానే ఎవరో ఓటు వేశారని నిరూపించుకోవాలి. దీంతో పీఓ టెండరు ఓటు ఇస్తారు. టెండరు ఓటు ఈవీఎంలో వేయడానికి వీలు లేదు. బ్యాలెట్ అందిస్తారు. బ్యాలెట్‌లో ఓటు వేసిన తరువాత పీఓకు అందించాల్సి ఉంటుంది. దీనిపై పీఓ సంతకం చేస్తారు. దానిని ఫారం 17బీ, 17సీలో నమోదు చేస్తారు. దానిని ప్రత్యేక కవరులో పెట్టి సీల్ చేస్తారు. పరిస్థితులు బట్టి దానిని పరిగణనలోకి తీసుకుంటారు.

ఎన్‌ఆర్‌ఐ ఓటు

విదేశాల్లో ఉన్న నాన్ రెసిడెంట్ ఇండియన్స్‌కు ఓటు హక్కు కల్పించారు. ఆన్‌లైన్ ఫారం2 నింపి తగిన ఆధారాలు చూపిస్తే ఎన్‌ఆర్‌ఐలకు ఓటు హక్కు కల్పిస్తారు. ఆసక్తి మేరకు విదేశాల నుంచి పోలింగ్ రోజున వచ్చి ఓటువేయవచ్చు.

కామ్రేడ్ అన్నా.. ఇదే సంగటన్నా....



సంగటిని గెలుకుతున్న కామ్రేడ్‌లు

రాజంపేట, మే3: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం.. వారి తరపున నిత్యం ప్రభుత్వంతో పోరాడే వామపక్ష నేతలు ఎక్కడున్నా శ్రమైక జీవన విధానంలో పేదల జీవన విధానానికి అనుగుణంగా ఉంటారు. ఆ కోవలో రాజంపేట ఎమ్మెల్యే స్థానానికి సీపీఐ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బోకే విశ్వనాధ నాయక్ పోటీ చేస్తున్నారు. ఆయన తరపున ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల కామ్రేడ్‌లు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా అట్టడుగు వర్గాలు ఎంతో ఇష్టంగా తినే సంగటిపై వీరు దృష్టిపెట్టారు. అంతే.... ఒక్కసారిగా బడుగులతో కలిసి కట్టెలను పోగు చేయడం, రాళ్లపెట్టుకోవడం, ఒక పెద్ద డబరా తేవడం, సంగటి గెలకడం చకచకా జరిగిపోయాయి. అంతే తలా ఇంత ఒక ముద్ద ఆకులో పెట్టుకోవడం, రోంత పచ్చడేసుకోవడం, పిడసలు చేసుకుని నోరారా తినడం.. దీనిని వారు పంచభక్ష పరమాణ్ణంగా తినేయడం. తిరిగి ప్రచారాల్లో పాల్గొనడం. ఇదీ ప్రచారాల్లో బడుగు వర్గాలకు అండగా ఉండే కామ్రేడ్‌ల తీరు. ఇంత కష్టపడి ప్రచారం చేస్తుంటే వారి ఆశలు కనుచూపు మేరలోనైనా కనిపిస్తాయా అన్నది శేష ప్రశ్న.

హవ్వ.. ఎన్నికల చిత్రం



అవ్వకు బ్యాలెట్ పత్రాన్ని చూపుతున్న దృశ్యం

రాజంపేట, మే3: నేటి హైటెక్ యుగంలో అ..ఆ కూడా రాని అవ్వాతాతల ఓట్లు ప్రధాన పార్టీలకు పెద్దసవాలుగా మారాయి. ఎందుకంటే చదువు రాని అవ్వాతాతలకు ఎక్కడ ఓటు వేయాలో.. ఏ గుర్తుపై వేయాలో, ఎవరు ఏ అభ్యర్థో అర్థం కాని పరిస్థితి. అందువల్ల పోలింగ్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు వారి బిడ్డలు చెప్పినట్లు మా గుర్తు ఫలానా దానికి వేయాలని ఉద్యోగుల ద్వారా వేయించుకోవడం ఎక్కువ శాతం జరుగుతోంది. లేకుంటే ఆ ఓటు మురిగిపోయినట్లే.. వారికి అర్థం కాక, వేయడం చేతకాక ఇష్టమొచ్చినట్లు వేసేస్తారు.. అందుకనే ఆయా గ్రామాల్లో యువకులు, ఆయా పార్టీల నేతలు అవ్వాతాతలకు ఎక్కువగా దీనిపై హితబోధ చేస్తుంటారు. వారి వద్దకు వెళ్లి అభ్యర్థుల ఎన్నికలను బ్యాలెట్ పత్రం రూపేణా చిత్రించిన కరపత్రాన్ని చూపిస్తూ ఇది సైకిల్ గుర్తు.. ఇది గ్లాసు గుర్తు, ఇది ఫలానా గుర్తు అని చెప్పి ఫలానా ఆయన మన అభ్యర్థి అని వారికి గుర్తుండేలా చెప్తారు. భువనగిరిపల్లెలోని ఆయా ప్రాంత యువకులు దీనిపై కసరత్తు చేశారు.. తమ గ్రామంలోని అవ్వలు, తాతల వద్దకు వెళ్లి ఇలా గుర్తు చూపిస్తూ ఓట్లు వేయాలని ప్రాధేయపడుతున్నారు. ఇందులో నేటి చిత్రం తెల్లారకముందే తొలిసూర్య కిరణాలు పడే వెలుతురులో కరపత్రాన్ని చూపుతూ సైకిల్ గుర్తుకు వేయాలని అవ్వకు ఓ యువకుడు సూచిస్తున్న చిత్రం. నేటి అవ్వాతాతల ఎన్నికల విధానంలో వారి పాత్రపై చెప్పకనే చెబుతోంది.

ఉప్పొంగిన యువ'చైతన్య'ం

వెయ్యిమందితో భారీగా బైక్‌ర్యాలీ



జాతీయ రహదారిపై యువకుల బైక్ ర్యాలీ

చెన్నూరు, మే 3: టీడీపీ కార్యకర్తలు, అభిమానుల్లో యువచైతన్యం ఉప్పొంగింది. ఇప్పటికే కమలాపురం నియోజకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు గోర్ల పుల్లయ్యగారి శివారెడ్డి శుక్రవారం పార్టీలో చేరడంతో ఆయన వెంట యువత పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ పుత్తాచైతన్య రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. ఎన్నడూ లేని విధంగా దాదాపు వెయ్యికి పైగా ద్విచక్రవాహనాలతో రెండు కి.మీ మేర భారీ ర్యాలీ చేశారు. పట్టణంలోని కేఓఆర్ కాలనీ మొదలు గవర్నమెంట్ ఆస్పత్రి, బుడ్డాయపల్లె క్రాస్ రోడ్డు, హైవే మీదుగా కొత్త రోడ్డు, నాగులకట్టవీధి, పార్కువీధి, పాతబస్టాండ్, తహసీల్దారు ఆఫీసు మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు ఈ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ పొడవునా సైకో పోవాలి, సైకిలు గెలవాలి, చైతన్యరెడ్డి జిందాబాద్, చైతన్యను గెలిపించుకుందాం, టీడీపీ జిందాబాద్ అంటూ నినాదాలు హోరెత్తాయి.

తెలుసుకోండి...

టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఎందుకంటే..!



మైదుకూరు, మే 3: కేంద్ర ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 అమలులోకి తీసుకొచ్చింది. దేశ వ్యాప్తం గా ఆ నెంబరుతో అన్ని జిల్లాల్లోనూ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసిం ది. ముఖ్యంగా 1950 నెంబరునే ఎందు కు ప్రవేశపెట్టిందనే విషయం వెనుక ప్రత్యేకత దాగి ఉంది. దేశంలో ఎన్నికల సం ఘం 1950 సంవత్సరం లోనే ఏర్పడింది. దీంతో అప్పటి నుంచి సార్వత్రిక, స్థానిక సంస్థలు సహా పలు రకాల ఎన్నికలను నిర్వహిస్తోంది. ఎన్నికల కమిషను ప్రారంభించిన ఇచ్ఛీటికి గుర్తు గా ఈ నెంబరును దేశ వ్యాప్తంగా అమలు చేస్తోంది.

ఇదో గోల.....

ఐదేళ్లలో ఉన్నదీ పోగొట్టుకున్న సర్పంచులు

ఎకరాలకు ఎకరాలు అమ్ముకున్న వైనం..!




రైల్వేకోడూరు, ఏప్రిల్ 30: సర్పంచులుగా పోటీ చేసేందుకు ఖర్చు పెట్టుకుని ప్రజాసేవ చేస్తామని అనుకుని గెలిచి ఊరికి రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని చెప్పి చివరకు నిధులు రాక సొంత ఆస్తులు, వ్యవసాయ భూములను అమ్ముకుని చివరకు పైసా లేకుండా పోయిందని సర్పంచులు ఆందోళన పడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు వచ్చాయి మళ్లీ గెలిపించమని అడుగుతున్నారని ప్రజల్లోకి ఎలా వెళ్లి ఓట్లు అడగాలని సర్పంచులు మదనపడుతున్నారు. నాయకులు మాత్రం ఎలాగైనా ఈ సారికి గెలిపించాలని సర్పంచులు కాళ్లు పట్టుకుంటున్నారు. రైల్వేకోడూరు మండలంలోని సుమారు పలువురు సర్పంచులు తమ వ్యవసాయ భూములను తాకట్టు పెట్టారు. మరి కొందరు భూ విక్రయాలు చేశారు. పుల్లంపేట, చిట్వేలి, పెనగ లూరు, ఓబులవారిపల్లె పంచాయతీల్లో కొందరు సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక తీవ్రంగా ఇబ్బందులు పడుతూ పరపతి తెచ్చిన చోట పరువు పోతోం దని ఏకంగా బంగారు నగలు, వ్యవసాయ భూములు పోగొట్టుకున్నారు. నాయకత్వం వహించేవారు సర్పంచులను పట్టించుకోకుండా ఉండడం, లెక్క చేయకపోవడం వంటివి ఐదేళ్ల నుంచి జరుగుతున్నాయి. దీంతో సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. కేవలం కొందరి సర్పంచులకు న్యాయం చేస్తున్నారని ప్రచారం లో ఉంది. ప్రస్తుతం చాపకింద నీరు లా సర్పంచులు కూటమికి బలం చేకూరుస్తున్నారు.

అప్పుడేనా?.....

చోటా నేతలతో రాయబేరాలు

వైసీపీలో చేరిన వారికి ఆఫర్లు



బద్వేలు, మే 3: ఎన్నికలు దగ్గర పడుతుండడంతో బద్వేలు నియోజకవర్గంలో గ్రామ, వార్డుస్థాయిలో చిన్న చిన్న నేతలు, మండలస్థాయి నేతలకు డిమాండ్ ఏర్పడింది. 10 ఓట్లు వేయించగలడన్న నమ్మకమున్న వారిన సైతం చేరదీసేందుకు పార్టీ నేతలు పోటీ పడుతున్నారు. పోలింగ్ బూత్‌లో కూర్చునేందుకు అవసరమైన ఏజంట్లకోసం అన్వేషణ మొదలైంది. నాయకులు ఓ వైపు ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తూనే మరోవైపు ఎన్నికల నిర్వహణకు అవసరమైన డబ్బు, మందు, కార్యకర్తల సేకరణలో పూర్తిగా నిమగ్నమయ్యారు. పట్టణ ప్రాంతాల్లో వార్డుస్థాయి నేతలను గ్రామాల్లో గ్రామస్థాయి నేతలను తమవైపు తిప్పుకునేందుకు వైసీపీ బేరసారాలకు తెరలేపింది. ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలకు అవసరమైన పనులను చేయిస్తామని, స్థాయిని బట్టి అవసరమైన పనులు చేపడతామని, కొంత డబ్బు ముట్టచెప్పి పార్టీలో చేర్చుకుంటున్నట్లు సమాచారం. ఇతర పార్టీల నుంచి బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో ఓ కౌన్సిలరు, మాజీ కౌన్సిలరు వైసీపీలో చేరారు. మండల పరిధిలోని వెంకటశెట్టిపల్లెలో ఓ నాయకుడు వైసీపీలో చేరారు. గ్రామాలలో, పట్టణాల్లో ప్రాబల్యం ఉన్న నేతలకు వివిధ ఆఫర్లు ఇచ్చి వైసీపీలో చేర్చుకోవడం పట్ల ఇలాంటి వారు చేరడం వలన పార్టీకే నష్టం జరుగుతుందని ఆపార్టీ నేతలు కొందరు గుసగుసలాడుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో గతంలో లేనంత ఎక్కువగా డబ్బు ప్రభావం కనిపిస్తోంది. ఇలా వైసీపీలో చేరిన కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు మండల స్థాయి నేతలకు లక్షలాది రూపాయల డబ్బు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో బేరసారాలకు వైసీపీ తెరలేపడంతో కొందరికి గిరాకీ ఏర్పాడింది. నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోశన్నకు లభిస్తున్న ఆదరణను చూసి వైసీపీకి వణుకు పుడుతోంది. ఈ నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి ఆఫర్లు ప్రకటిస్తూ వైసీపీ నేతలు తమ పార్టీలో చేర్చుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అభ్యర్థి కటౌట్‌లు చూపిస్తూ మహిళల ప్రచారాలు



సుగవాసి బాలసుబ్రమణ్యం కటౌట్‌లతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

రాజంపేట, మే3: రాజంపేట నియోజకవర్గం ఒక పెద్ద జిల్లాను పోలి ఉంటుంది. రైల్వేకోడూరు బార్డర్ నుంచి కడప జేఎంజే వరకు ఇటు బద్వేలు నియోజకవర్గం అట్లూరు వరకు, అటు పీలేరు వరకు, రాయచోటి వరకు మరో వైపు వేంపల్లి బార్డర్ వరకు ఈ నియోజకవర్గ విస్తీర్ణం 150 కిలోమీటర్ల పైబడి ఉంటుంది. అన్నీ గుట్టలు, కొండలు, ఘాట్ రోడ్లు సుమారు వంద గ్రామ పంచాయతీలు, ఇందులో వెయ్యికి పైబడి మజరా గ్రామాలున్నాయి. నియోజకవర్గంలో రెండున్నర లక్షల పైబడి ఓటర్లు, 5లక్షల జనాభా ఉంటుంది. ఇన్ని ప్రాంతాల్లో పార్టీ టికెట్టు తీసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్ని గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. కనీసం మూడు నెలలైనా సమయం ఉంటే తప్ప అన్ని పల్లెలను టచ్ చేయడం కష్టం.. అందువల్ల ఆయా ప్రాంత నేతలు సుగవాసి బాలసుబ్రమణ్యం కటౌట్‌లు ఏర్పాటు చేసుకుని ఈయనే.. సుగవాసి బాలసుబ్రమణ్యం, సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నినాదాలు చేస్తూ ఆయన పోలిన కటౌట్‌లను ప్రజలకు చూపుతున్నారు. ఇది చూసిన వరికి ఈయనేనా.. మన కాబోయే ఎమ్మెల్యే అంటూ.. మన గుర్తు సైకిల్ బాలసుబ్రమణ్యంకే ఓటు అంటూ ఓటర్లు సంబరపడుతున్నారు.

చేరికలతో దూసుకుపోతున్న పుట్టా

దువ్వూరు(మైదుకూరు), మే 3 : దువ్వూరుమండలం భీమునిపాడు ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు 40 కుటుంబాల వారు శుక్రవారం టీడీపీ చేరారు. గ్రామానికి చెందిన జ్యేష్టాది దేవరత్నం, సామేల్, దేవానందం, ఓబులేసు, రాజా, సుబ్బరాయుడు తదితరులకు చెందిన దాదాపు 40 కుటుంబాల వారు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోరెడ్డి రమణారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో బ్రహ్మంగారిమఠం మండలం లోని నరసన్నపల్లె వీవర్స్‌కాలనీ కి చెందిన చేనేత కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు బండి సుబ్బయ్య, అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దబ్బగుంట్ల సుబ్బయ్యయాదవ్‌తో పాటు పలు కుటుంబాలు శుక్రవారం ప్రొద్దుటూరుపట్టణంలోని పుట్టా సుధాకర్‌యాదవ్ టీడీపీ కార్యాలయంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బి.మఠం ప్రచార టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా ఆనంద్‌యాదవ్, ముడుమాల పోలిరెడ్డి, సారే రామానాయుడు, నాగిపోగు గంగయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో జగనాసురున్ని అంతం చేయాలని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని అప్పనపల్లె పంచాయతీలోని రంగాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ఇన్‌ఛార్జి వెంకటస్వామి, నాయకులు బండి వెంకటేష్, చిన్న, నాగార్జున యాదవ్, గోవిందురెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, ఫరూక్, జిలాన్, జెండాల మాబాష, చంద్ర ఓబుళరెడ్డి, సుబ్బయ్య, వీరయ్య, పిచ్చినాయుడు, రామానాయుడు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, రమణ, రాము, శ్రీనివాసులు, ఇండ్ల సుబ్బారెడ్డి, పూలసుల్తాన్, షఫి, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు(మైదుకూరు)..: దువ్వూరు మండలం మదిరేపల్లెకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన చిట్టిబోయిన చిన్న గురవయ్య, నంద్యాల బాలయ్య, దనికెల్లా రమణయ్య మరియు వారు అనుచరులను శుక్రవారం రాత్రి టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.


ఖాజీపేట.. పథకాలను మహిళలకు వివరిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్


దువ్వూరులో టీడీపీలో చేరిన భీమునిపాడు వైసీపీ నాయకులు


బీమఠం..పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన బండి సుబ్బయ్య

హత్యా రాజకీయాలకు పాల్పడేది రఘురామిరెడ్డే : పుట్టా



ఖాజీపేట, మే 3: నేను నిజాయితీగా పనిచేస్తా, మా కార్యకర్తలను నిజాయితీగా పనిచేయాలని చెబుతా, మీ మాదిరి హత్యా రాజకీయాలు చేయనని ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఉద్దేశించి టీడీపీ మైదుకూరు అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రంగాపురంలో విలేకరులతో పుట్టా మాట్లాడుతూ మీ చరిత్ర నియోజకవర్గంలోని ప్రజలకు తెలుసునని, ఓటమి భయంతో పిచ్చిపట్టి నాపై కూడా కేసులు పెడుతున్నావన్నారు. 2009లో శేఖర్‌రెడ్డిని రాజోలిపేట అయ్యవారిపల్లెలోని బూత్‌లో ఉంటే హత్య చేయాలనుకున్నది నీవు కాదా అని ప్రశ్నించారు. 2013లో వెంకటసుబ్బయ్య అనే వ్యక్తిపై వేటకొడవళ్లతో దాడి చేయించలేదా, 2014లో ఎన్నికల ముందు వెంకటసుబ్బయ్య తమ్మున్ని కిడ్నాప్ చేయించలేదా, డీఎల్ రవీంద్రారెడ్డిపై కూడా మీవారితో చెప్పులు వేయించలేదా అని ప్రశ్నించారు. నిన్న జరిగిన సంఘటన ఎంతో విచిత్రంగా చేయిస్తున్నావు. 13 సంవత్సరాలు నీ దగ్గర పనిచేస్తే నీవు అన్యాయం చేశావని మా పార్టీలో చేరారు. నీవు మాత్రం 123 కేసులు ఉన్న వ్యక్తులను పార్టీలో చేర్చుకుంటున్నారంటే నీ ప్రభుత్వంలో నీ దగ్గర 13 సంవత్సరాలు పనిచేసినప్పుడే ఆ కేసులు ఉంటాయని అన్నారు. నేను కిడ్నాప్ చేసి కొట్టినట్లు డ్రామాలు ఆడుతున్నావని, న్యాయపరంగా పోలీసులు విచారణ చేయాలన్నారు. నేను ప్రజల దగ్గరకు వెళ్లి ఓట్లు వేయాలని అడుగుతున్నానని, నీవు మాత్రం ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నావన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర, నీ చరిత్ర ముగిసినట్లే. మీ కార్యకర్తలు ప్రతి మండలంలో ఎర్రచందనం దుంగల వ్యాపారం చేసేవారు ఉన్నారన్నారు. అన్ని మండలాల్లో ప్రశాంతంగా ప్రచారాలు జరుగుతుంటే మీ సొంత మండలం చాపాడులో మాత్రమే అరాచకాలకు పాల్పడుతున్నావని రఘురామిరెడ్డిపై పుట్టా విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, బండి వెంకటేష్, గోవిందురెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో సమగ్రాభివృద్ధి

● కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి



ప్రొద్దుటూరులో వరదరాజులరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న భూపేష్‌రెడ్డి... మైలవరంలో ఆదినారాయణరెడ్డితో ప్రచారం

కడప, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు అయితే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, అయితే కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేందుకు ఎన్డీయే కూటమి అభ్యర్థులైన సైకిల్, కమలం గుర్తులపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లె గ్రామంలో ప్రొద్దుటూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, మైలవరం మండలంలో జమ్మలమడుగు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డిలతో కలిసి భూపేష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం దివాళా తీసిందన్నారు. సొంత జిల్లా కడపకు జగన్ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. మూడేళ్లలో స్టీల్ ఫ్యాక్టరీని పూర్తిచేస్తానని రెండుసార్లు కొబ్బరికాయ కొట్టారు. ఇంత వరకు కనీసం కాంపౌండ్ కూడా పూర్తిచేయలేదన్నారు. కొప్పర్తిలో పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని నిరుద్యోగుల్లో ఆశ పెంచారన్నారు. పరిశ్రమలు పూర్తికావాలన్న, స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరగాలన్న కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు వస్తేనే సాధ్యమవుతున్నారు. మళ్లీ జగన్ వస్తే ఆస్తులను లాక్కుంటాడన్నారు. ఇప్పటికే వైసీపీ బ్యాచ్ అంతా జిల్లాలో సహజవనరులను కొట్టేసిందని, జనం స్వేచ్ఛగా బతకాలంటే ఎన్డీయే కూటమి రావాలన్నారు.

5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోండి

జమ్మలమడుగు, మే 3: ఈనెల 5, 6తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవాలని జమ్మలమడుగు సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కరుణాకర్ తెలిపారు. జమ్మలమడుగులోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆయన శుక్రవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ, బాలుర జూనియర్ కళాశాలలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈనెల 5వ తేదీ పీవో, ఏపీవోలు, 6వ తేదీ పోలింగ్ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవాలని ఏర్పాట్లు చేశామన్నారు.

టీడీపీ మాజీమండల అధ్యక్షుడు మృతి



అట్లూరు, మే 3 : అట్లూరు గ్రామానికి చెందిన బోవెల్ల రాజగోపాల్‌రెడ్డి తి(77) శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. రాజగోపాల్‌రెడ్డి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడుగా రెండుసార్లు పని చేశారు. ఆయన మృతికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకుడు రితీష్‌రెడ్డి, బద్వేలు బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న నాయకులు నందగోపాల్‌రెడ్డి, ఎం.సూర్యనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, అమర్‌నాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

షర్మిలను గెలిపించండి

పోరుమామిళ్ల, మే 3 : దివంగత సీఎం వైఎస్ఆర్, వైఎస్ వివేకాల ఆత్మకు శాంతి కలగాలంటే కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిలను గెలిపించాలని డాక్టర్ వైఎస్ సునీత అన్నారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా శుక్రవారం మండలంలోని బూరుగమాను పల్లె, రామేశ్వరం, వెంకటాపురం, అక్కలరెడ్డిపల్లె, కాల్వకట్ట, కొండగారిపల్లె, చింతలపల్లె తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి షర్మిల, ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయజ్యోతిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయజ్యోతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సునీత

ఎన్డీఏ కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి



బద్వేలు.. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన వారు, ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న, యువనేత రితీశ్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, మే 3 : ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్‌లో వైసీపీ నుంచి నరసింహులు ఆయనతోపాటు మరో 50మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఈ కార్య క్రమంలో ఉప్పలపాటి వెంకటసుబ్బయ్య, సింగరయ్య, రవి, బసవి రమేష్, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మాచుపల్లె క్రిష్ణారెడ్డి, సింగంశెట్టి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచకపాలనకు అంతంపలకండి..: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అంతంపలికే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శివానగర్‌లో కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నను గెలిపించాలంటూ ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థ సారధి, మిత్తికాయల రమణ, వెంగల్‌రెడ్డి, నరసింహులు, సింగసాని విజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపు కోసం బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు గ్రామాల బాటన పడి విస్తృతంగా ప్రచారం ఏస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి రోశన్నగెలిపించాలని, ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌లను గెలిపించాలని కోరారు.

కలసపాడు..: మండలంలోని చెన్నుపల్లె, గోపవరంపల్లె, పెండ్లిమర్రి గ్రామాల్లో 50 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో చేరాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రంతు, చిన్నసింగరయ్య, కానెశింగరయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, పెండ్లిమర్రికి చెందిన ఈశ్వర్‌రెడ్డి వర్గీయులు చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు వెంకట్రామరెడ్డి,నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: బద్వేల్ నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జారోశన్నను కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని బద్వేల్ టీడీపీ యువనేత రితీష్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వరికుంట్ల గ్రామంలో మండల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, రాజారెడ్డి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి,రోహిత్‌రెడ్డి, కొండా నరసింహారెడ్డి, హోండా రవీంద్రారెడ్డి,డి.క్రిష్ణారెడ్డి, నాయనపల్లె రమణారెడ్డి, క్రిష్ణయ్య,పి.పోలిరెడ్డి,కోడిగుడ్లపాడు సర్పంచ్ గురయ్య,ఎల్ శ్రీనివాసులరెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి,బి.నరసింహారెడ్డి,టి.నరసింహులు,ఏ.రమణారెడ్డి పాల్గొన్నారు


కలసపాడు... మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన వారు


బద్వేలులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న, విజయమ్మ


పోరుమామిళ్లలో బొజ్జ రోశన్న గెలుపు కోసం ప్రచారంచేస్తున్న కూటమి నేతలు

జగన్‌ను ఇంటికి సాగనంపండి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం.సురేశ్‌నాయుడు



ఎర్రగుంట్ల, మే 3: రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గద్దెదించాలని ప్రజలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం.సురేశ్‌నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి ఎర్రగుంట్ల మండలపరిధిలోని పి.గోపులాపురం గ్రామంలో ఆయన ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి సి.భూపేశ్‌రెడ్డిని గెలిపించాలని ఆదిసోదరుడు సి.గోపాల్‌రెడ్డితో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైసీపీ వైఫల్యాలను ఎండగట్టారు. కరపత్రాలను పంపిణీచేస్తూ టీడీపీ సూపర్‌సిక్స్‌తోపాటు, మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సైకోపాలన సాగుతోందన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ డబులింజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. జగన్‌పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రంగాల పరిపాలనలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అతి కొద్దిరోజుల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందన్నారు. ఈకార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి ఎం.మోహన్‌రెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జంగంరెడ్డి, గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులపై పగబట్టిన జగన్

బ్యాంకులలో పెన్షన్లు వేసి ఇబ్బందులుపెడుతున్నారు : వరదరాజులరెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి, పథకాలు వివరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు, మే 3 : వృద్ధులు, వికలాంగులపై జగన్ పగబట్టి పెన్షన్లు బ్యాంకుల్లో వేసి తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నాడని టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వరదరాజులరెడ్డి, భూపేష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని బొజ్జవారి పల్లె, ఉప్పరపల్లె, బంకచిన్నాయపల్లెలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బోడెల బాబుల రెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, పగిడాల దస్తగిరి పాల్గొన్నారు.

రాచమల్లు జిమ్మిక్కులు ప్రజలు గుర్తించారు..: పదేళ్ల పాటు ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చేసిన జిమ్మిక్కులను ప్రజలు గుర్తించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 16 వవార్డు మోడంపల్లెలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన వరదరాజులరెడ్డి భూపేష్ రెడ్డిని గెలిపించాలని ఆయ ప్రచారం చేశారు. కార్యక్రమంలోవీఎస్ ముక్తియార్, బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నరసింహులు తలారిపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి దెబ్బమీద దెబ్బ : వైసీపీకి దెబ్బమీద దెబ్బ పడుతూనే ఉంది. వైసీపీ 17 వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితా ఆమె భర్త మాజీ కౌన్సిలర్ చింత కుంట జయలింగారెడ్డి శుక్రవారం ఉదయం నడింపల్లెలోని వారి స్వగృహం లో టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థ నంద్యాల వరదరాజులరెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వరద రాజులరెడ్డి మాట్లాడుతూ జయలింగారెడ్డి సీనియర్ నాయకుడని ఆయన టీడీపీలో చేరడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో, వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి,వంగనూరు మురళీధర్‌రెడ్డి,ఈవీ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బత్తల రాజశేఖర్ యాదవ్ సోదరులు..: ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని 32 వవార్డు వైసీపీ నాయకుడు బత్తల రాజశేఖర్ యాదవ్ సోదరులు శుక్రవారం టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి వరద రాజులరెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు, వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, వంగనూరు మురళీధర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చల్లా రాజగోపాల్ యాదవ్, నల్లబోతుల నాగరాజు, జనసేన జిలాన్, టీడీపీలో చేరిన వారిలో శివశంకర్, మురళీ, గోవర్ధన్,జగన్, శివ, విష్ణు, అనిల్, నాగరాజు, శ్రీను, బాబయ్య వున్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు గెలిపించండి..: ఎన్డీఏ కూటమిని గెలిపించి దేశంతో పాటు రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 17 వవార్డు నడింపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ బీజేపీ జనసేన కూటమి మేనిఫెస్టోను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాములేటి నరసింహులు,బాబయ్య, మీరావల్లి, రమేష్‌రెడ్డి కిషోర్, జయసింహా, ఖాసీం, ఆటో బాబయ్య, సుభాన్‌బాషా, భార్గవ్, మీరాహుస్సేన్, బద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును మళ్ళీ రప్పించాలంటే సైకిల్‌కు ఓటేయాలి..: చంద్రబాబును మళ్ళీ ముఖ్యమంత్రిగా రప్పించాలంటే సైకిల్ గుర్తుకు ఓటేయాలని టీడీపీ అభ్యర్థివరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణమ్మ, కోడలు మీనా, ఓటర్లును అభ్యర్థి ంచారు.శుక్రవారం గోపవరం పంచాయతీ లోని ఆచార్లకాలనీ లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలోబచ్చల ప్రతాప్, ఆవుల రాజేశ్వరరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జీసీ పుల్లయ్య, మల్లెల భాస్కర్, చీమల రాజశేఖర్‌రెడ్డి,బోగాల లక్ష్మీనారాయణమ్మ, శైలజ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


17 వార్డు ప్రచారంలో దూసుకుపోతున్న వరదరాజులరెడ్డి


ఆచార్ల కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న వరదరాజులరెడ్డి కుమార్తెలు

వైభవంగా గూడుమస్తాన్‌వలి ఉరుసు



గూడుమస్తాన్‌వలి దర్గాలో పాతెహాలు చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు, మే 3: జమ్మలమడుగు పట్టణంలో పెన్నానది ఒడ్డున వెలసిన హజరత్ సయ్యద్‌షా గూడుమస్తాన్‌వలి ఉరుసు శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దర్గా కమిటీ ప్రెసిడెంట్ ముల్లాజానీ, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రి దర్గాలో కులమతాలకు అతీతంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ప్రత్యేక పాతెహాలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించి భక్తులు మొక్కుకున్నారు. దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉరుసు ఉత్సవాన్ని పురస్కరించుకుని రాత్రి ముంబై వారిచే గొప్ప ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా ప్రాంగణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో అర్బన్ పోలీసు అధికారులు, వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

● క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్

పులివెందుల, మే 3: ప్రజారోగ్య పరిరక్షణలో అక్రమాలకు పాల్పడే ప్రైవేట్ ఆసుపత్రుల వ్యవహారశైలిని ఎంతమాత్రం సహించబోమని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.రమేష్ హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో తనిఖీలు మరిచారు అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ప్రైవేట్ ఆసుపత్రుల రెన్యువల్స్, రిజిస్ట్రేషన్లు తదితర అంశాలను తనిఖీ చేసేందుకు డిప్యూటీ డీఎంహెచ్ఓలు ఉంటారని, క్రమానుగుణంగా వారు తనిఖీలు చేస్తుంటారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రైవేట్ వైద్య సంస్థలలో కార్యకలాపాలను అనునిత్యం తనిఖీ చేస్తూనే ఉంటారని, ఎటువంటి అక్రమాలైన దృష్టికి వస్తే వాటిపై వెంటనే తగు చర్యలు తీసుకుంటారని వివరించారు. ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న కథనంపై ఆయన స్పందిస్తూ ఏపీ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏపీ ఏపీఎంసీఈ) యాక్ట్ 2002 నియమ నిబంధనలకు లోబడి ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేస్తుంటారని తెలిపారు. అదేవిధంగా ఫీజుల వివరాలను ప్రదర్శించని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా డీఎంహెచ్ఓలు, వారివారి బృందాలు 618 ప్రైవేటు ఆసుపత్రుల్ని తనిఖీ చేశారని డాక్టర్ రమేష్ వివరించారు. కడప జిల్లాలో 83 ప్రైవేట్ ఆసుపత్రుల్ని తనిఖీ చేశారని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద సిజేరియన్ చేసేందుకు ఓ ఆసుపత్రి తిరస్కరించిందన్న అంశంపై కడప జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ స్పందిస్తూ ఇందుకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని స్పష్టం చేశారు.

విద్యుత్తు సమస్యలపై తక్షణమే స్పందించాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఎస్.రమణ

జమ్మలమడుగు, మే 3: ప్రజలకు ఎక్కడ విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ఉన్న చోట తక్షణమే స్పందించి కరెంటు సమస్యలు రాకుండా చూడాలని ఉమ్మడి వైఎస్ఆర్‌జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ ఆదేశించారు. శుక్రవారం జమ్మలమడుగులోని కోవెలకుంట్ల రోడ్డు శ్రీ రంగనాథస్వామి ఫంక్షన్ హాలులో విద్యుత్తు అధికారులకు సమావేశం నిర్వహించారు. జమ్మలమడుగు, ముద్దనూరు, మైలవరం, పెద్దముడియం మండలాలకు సంబంధించిన విద్యుత్తు శాఖ అధికారులతో సమావేశమై వారికి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం దేవుడు ఇచ్చాడని, విద్యుత్తు సంస్థ తరపున ప్రజలకు విద్యుత్తు అధికారులు, సిబ్బంది సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని పనులు పూర్తి చేస్తే ఫలితాలు ఉంటాయన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, ఒక క్షణం కరెంటు పోయినా ప్రజలు భరించే స్థితిలో లేరని, అందుకు విద్యుత్తు సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. కరెంటు లేకున్నా గ్రామాల్లో, పట్టణాల్లో నీటి సమస్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఎక్కడా లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా ఆయా ప్రాంతాల్లో సిబ్బంది పనులు చేయాలన్నారు. ప్రస్తుతం విద్యుత్తు అంతరాయాలు అధికంగా ఉన్నాయని, అధికారులకు చెప్పినా స్పందించని వారిపై చర్యలు తప్పవన్నారు. విద్యుత్తు సిబ్బంది లైన్లలో తిరిగి సమస్యలు గుర్తించాలన్నారు. ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్తు చౌర్యాన్ని అరికట్టి వాలిపోయిన స్తంభాలను లూజు లైన్లను సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజగోపాల్, ఏఏఓ రాధమ్మ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థి



మహమ్మద్‌నబీ ఆజాద్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న డైరెక్టర్ గుప్త తదితరులు

వేంపల్లె, మే 3: మల్టీ నేషన్ సంస్థ అయిన గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్ ప్రోగ్రాంకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థి షేక్ మహమ్మద్‌నబీ ఆజాద్ ఎంపికయ్యారు. ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ 3వ సంవత్సరం చదువుతున్న ఆ విద్యార్థి సుమారు 350 గంటలు కష్టపడి ఈ అరుదైన ప్రతిభ సాధించాడని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు ఈ విద్యార్థి పనిచేస్తారని తెలిపారు. రూ.2.50 లక్షల స్టైఫండ్ గూగుల్ సంస్థ నుంచి అందుకున్నందుకు ఆ విద్యార్థిని అభినందించారు. డైరెక్టర్ గుప్త, హెచ్ఓడి రవి, అకడమిక్ డీన్ రత్నకుమారి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ వినోద్ ఇతర అధ్యాపకుల సహకారంతో ఈ అవకాశం లభించిందని ఈ విద్యార్థి తెలిపారు.

ఇన్నోవా కారు -బైకు ఢీ - వ్యక్తి మృతి

కొండాపురం, మే 3: మండలంలోని వెంకటాపురం గ్రామం సమీపంలో ఇన్నోవా కారు, బైకు ఢీకొన్న సంఘటనలో శుక్రవారం శివశంకర్ అనే వ్యక్తి మృతి చెందాడు. ముద్దనూరు మండలం ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన కె.శివశంకర్ తన భార్యతో కలిసి స్వగ్రామానికి బైకులో వెళ్తుండగా ఎదురుగా ఇన్నోవా కారు వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో శివశంకర్ అక్కడికక్కడే మృతిచెందగా, అతని భార్యకు గాయాలయ్యాయి. ఈమెను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు



నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్న పోలీసులు

కమలాపురం రూరల్, మే 3: నగర పంచాయతీ పరిధిలోని పక్కీరువీధిలో మంగళవారం తెల్లవారుజామున మహ్మద్‌బాషా అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసి కోర్టు కుహాజరు పరిచినట్లు సీఐ రామక్రిష్ణరెడ్డి, ఎస్ఐ రుషికేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వారు పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని పక్కీరువీధిలో నివాసం ఉంటున్న ఉస్మాన్‌గని బాషా కుమారుడు మహ్మద్‌బాషా అలియాస్ గని హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే క్రికెట్ విషయంలో చోటు చేసుకున్న ఘర్షణ హత్యకు దారి తీసిందని తెలిపారు. హత్య చేసిన వారు ఆ రోజు నుంచి పరారీలో ఉన్నారని, ప్రధాన నిందితులను శుక్రవారం పందిళ్లపల్లె గ్రామ సమీపంలో పోలీసు బృందాలు వెళ్లి పది మంది యువకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండుకు తరలించారన్నారు.

పెన్షన్‌దారుల కష్టాలపై రాచమల్లు విష ప్రచారం



వృద్ధురాలితో మాట్లాడుతున్న రాచమల్లు

ప్రొద్దుటూరు, మే 3: రాష్ట్రంలో ఎన్నికల వేళ అపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పండుటాకులపై పగబట్టారు. పెన్షన్‌ను ఇళ్లవద్దకు వెళ్లి పంపిణీ చేయకుండా బ్యాంకుల్లో వేసి వారిని తీవ్ర కష్టాలపాలు చేస్తున్నారు. దీనిని వైసీపీ నేతలు చంద్రబాబు పైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు గాంధీరోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకువద్ద పెన్షన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధుల వద్దకు ఎమ్మెల్యే రాచమల్లు వెళ్లి నీచ రాజకీయాలు చేశారు. జగన్ 58 నెలలు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ చేశాడని అన్నారు. చంద్రబాబు వల్ల మీకు బ్యాంకుల చుట్టూ తిరిగే కష్టాలు మళ్లీ వచ్చాయని అన్నారు. చంద్రబాబు వస్తే మళ్లీ ఇలాంటి కష్టాలు వస్తాయని విషప్రచారం చేశారు. అనంతరం అక్కడున్న వృద్ధులకు మంచినీళ్ల బాటిళ్లు అందజేశారు. తానే స్వయంగా వృద్ధులందరికీ గ్లాసుల్లో మజ్జిగ ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులు వేల మంది ఉన్నా.. వారి ద్వారా ఇళ్లవద్దకు వెళ్లి పెన్షన్లు ఇచ్చే అవకాశం ఉన్నా అలా చేయకుండా.. జగన్ ప్రభుత్వం కావాలనే పండుటాకులను ఇబ్బందులకు గురిచేయడంతో అందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చౌడేశ్వరి ఆలయానికి రూ.6.20 లక్షలు విరాళం

ప్రొద్దుటూరు, మే 3: ప్రొద్దుటూరు పట్టణం మేదరవీధికి చెందిన శ్రీరామలింగచౌడేశ్వరిదేవి ఆలయానికి అంపావతిన వీరప్రసాద్, పేరి గురుమూర్తి రూ.5.20 లక్షలు విరాళం అందజేశారు. శుక్రవారం స్థానిక మేదరవీధిలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఉట్టినాగశయనం, కార్యదర్శి గిద్దలూరు శ్రీనివాసులు సమక్షంలో వారు పై మొత్తాన్ని ఫిక్స్‌డ్ బాండ్ రూపంలో అందజేశారు. అలాగే కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి రూ.1 లక్ష విరాళం అందజేశారు. వీరందరికి ఆలయ కమిటీ తరపున సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు పోసా వెంకటలక్షుమయ్య, గిద్దలూరు ఈశ్వరయ్య, పూజరి రాఘవేంద్రలు పాల్గొన్నారు.

రాజకీయం అంటే అభివృద్ధి, సంక్షేమం





మైలవరంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గండ్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న దేవగుడి శివనారాయణరెడ్డి తదితరులు

మైలవరం, మే 3: గతంలో ఎంతో అభివృద్ధి చేశాం, వీటికంటే గ్రామాలు ఇంకా అభివృద్ధి చెందాలంటే మమ్మల్ని ఆశీర్వదించి గెలిపించాలని ఎన్డీయే కూటమి కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మల మడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నకొమెర్ల, పెద్ద కొమెర్ల, తలమంచిపట్నం, వద్దిరాల, దొడియం, ఆర్సీపల్లి, పొన్నంపల్లి, గంగులనారాయణపల్లి, తొర్రివేముల, నార్జాంపల్లి, మైలవరం, వేపరాల, దొమ్మరనంద్యాల పంచాయతీలలో దాదాపు 60 కి.మీ మేర ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో రోడ్‌షో కొనసాగింది. ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సోలార్ ప్లాంట్, ఎస్ఆర్‌బీసీ కాలువలను పూర్తి చేసి రైతులను ఆదుకుంటామన్నారు. దాల్మియా పరిశ్రమలోని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏసీసీ భూబాధిత రైతులకు న్యాయం చేస్తామన్నారు. వద్దిరాల, రామచంద్రాయపల్లిలో తాగునీటి సమస్య ఉందని స్థానికులు చెప్పడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రామాల్లో బోర్లు వేసి మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని నాయకులకు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటుగా శాంతి భద్రతలు ఉండేలా నాయకత్వం వహించాలన్నారు. రైతుల పాస్ పుస్తకాల్లో సీఎం జగన్ ఫొటో పెట్టడం భూమి ఏమైనా ఆయన సొత్తా అని విమర్శించారు. మహిళలు, యువత, రైతులను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి మేనిఫెస్టోను ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు మల్లేల గురివిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, పాపిరెడ్డి, కొండయ్య, పుల్లారెడ్డి, సూర్యపుద్దిరాజు, కర్నాటి రామాంజనేయరెడ్డి, సంజీవ, చంద్ర, గోపాల్, భాస్కర్‌రెడ్డి, మునిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: జిల్లా, నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి, కడప ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జీ దేవగుడి శివనారాయణరెడ్డి కోరారు. కొండాపురం మండలంలోని గండ్లూరు, ఓబన్నపేట, సీతాపురం, చామలూరు, యర్రగుడి గ్రామాలలో శుక్రవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి, వంగనూరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: మండలంలోని తిరుమలాయపల్లె గ్రామంలో ఎన్డీయే కూటమి మండల బీజేపీ ఇన్‌ఛార్జ్ శివనారాయణరెడ్డి సమక్షంలో శుక్రవారం ఎన్డీయే కూటమిలో చేరారు. తలారి రమణయ్య పెద్దోడు, మల్లికార్జున, సత్యనారాయణ తదితరులు కూటమిలో చేరారు. ఈ సందర్భంగా శివనారాయణరెడ్డి కండువాలు కప్పి వారిని ఎన్డీయేలో కూటమిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



పుష్పగిరి క్షేత్రం

వల్లూరు, మే 3: దక్షిణ కాశిగా పేరొందిన పుష్పగిరి క్షేత్రంలో వెలసిన కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, లక్ష్మి చెన్నకేశవ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వ తేది నుంచి 14వ తేది వరకు నిర్వహిస్తున్నామని ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, ఈవో శ్రీనివాసులు, ఆలయ అర్చకులు అఖిల్‌దీక్షితులు తెలిపారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. కొండపైన క్షేత్రపాలకుడు శ్రీలక్ష్మి చెన్నకేశస్వామి, సంతాన మల్లేశ్వరుడు ఒకే ప్రాకారంలో వెలసి భక్తులకు దర్శనభాగ్యం కలగజేస్తున్నారని తెలిపారు. పుష్పగిరి క్షేత్రాన్ని దక్షిణ కాశిగా, భూలోక వైకుంఠంగా పేర్కొంటారని, ఇక్కడ పంచమ నదులు కొలువై ఉంటాయన్నారు. వైశాఖ శుద్ధ తదియ (అక్షయ తృతీయ) నాడు పెన్నానదిలో సంకల్ప పూర్వకంగా తీర్థస్నానాలాచరించి శివకేశవులను దర్శించిన వారికి 100 మార్లు అశ్వమేధ యాగాన్ని చేసిన ఫలితం కలుగుతుందన్నారు. స్వామివార్లకు వివిధ సేవలతో పాటు వైద్యనాథేశ్వర, లక్ష్మి చెన్నకేశవస్వామి వార్లకు వివిధ వాహనాల్లో గ్రామోత్సవ నిర్వహణ ఉంటుందన్నారు.


ఉత్సవ వివరాలు : ఈ నెల 5న ఆదివారం వైద్యనాథేశ్వరుడు, లక్ష్మీచెన్నకేశవస్వామికి అంకురార్పణ, 6న సోమవారం రాత్రి 7గంటలకు ధ్వజారోహణం, హంస వాహన సేవ, అనంతరం తిరుచ్చి వాహనసేవ ఉంటుందని, 7న మంగళవారం రాత్రి సింహవాహనంపై వైద్యనాథేశ్వరుడు, అనంతరం హంసవాహనంపై లక్ష్మి చెన్నకేశవులు, 8న రాత్రి పురుషాన్ మృగవాహనంపై వైద్యనాథేశ్వరుడు, రాత్రి 8గంటలకు కొండపైన కలశ వాహనం, గ్రామోత్సవం, 9న రాత్రి వైద్యనాథేశ్వరుడికి మయూర వాహనం, అనంతరం చందనాలంకారం, హనుమత్‌వాహనంపై చెన్నకేశవుని గ్రామోత్సవం ఉంటుందన్నారు. 10న నందివాహనంలో వైద్యనాథేశ్వరుడు, అదే రోజు ఉదయం పూలంగిసేవ, రాత్రికి గరుడ వాహనంపై గ్రామోత్సవం, 11న శనివారం ఉదయం శ్రీకామాక్షి సమేత వైద్యనాథేశ్వరునికి ఉదయం కల్యాణోత్సవం, రాత్రికి గజవాహనంపై గ్రామోత్సవం, అనంతరం శ్రీలక్ష్మి చెన్నకేశవ కల్యాణం, రాత్రికి గజవాహనంపై గ్రామోత్సవం, 12న ఉదయం వివిధ పూజలు, హోమాలు అనంతరం వైద్యనాథేశ్వర రథోత్సవం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. 13న సోమవారం రాత్రి 7 గంటలకు వైద్యనాథేశ్వరుడు, చెన్నకేశవులకు అశ్వవాహన సేవ ఉంటుందని తెలిపారు. అదేవిధంగా 14న మంగళవారం ధ్వజావరోహణం, చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి పుష్పయాగం ఉంటుందని, రాత్రికి తిరుచ్చివాహనం ఉంటుందన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం వివిధ హోమాలు, జపాలు, స్నపన తిరుమంజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు స్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తరించాలని కోరారు.



పుష్పగిరి కొండపైన వెలసిన చెన్నకేశవస్వామి, లక్ష్మి అమ్మవారు, సంతాన మల్లేశ్వరుడు

దిగ్విజయంగా కేజీసెట్

సీకేదిన్నె, మే 3: కేజీసెట్ 2024 దిగ్విజయంగా ముగిసినట్లు కేఎస్ఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం కళాశాలలు సంయుక్తంగా ఇంటర్ ఉత్తీర్ణులై ఇంజనీరింగ్ చేయాలనే విద్యార్థులకు నిర్వహించిన కేజీసెట్ గత మూడు రోజులుగా మంచి స్పందన లభించిందని, శుక్రవారం దిగ్విజయంగా 2,900 మంది హాజరై పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఎంసెట్ తరహాలో నిర్వహించే ఈ పరీక్ష వలన విద్యార్థులకు అవగాహన కలగడంతో పాటు కళాశాల అందించే సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకోవచ్చన్నారు. కళాశాలలో కల్పించిన వసతుల పట్ల పరీక్షకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌ఛైర్మన్ మదనమోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరప్రసాద్, కేఎల్ఎం ప్రిన్సిపల్ ఎంవీ రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ కిరణ్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెన్స్‌రీ సీనియర్ ఆఫీసర్ నాగరాజు, 2024 కన్వీనర్ కిశోర్‌కుమార్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



కేఎస్ఆర్ఎం కళాశాలలో కేజీసెట్‌కు హాజరైనవారు

యువతి ఆత్మహత్య

సంబేపల్లె, మే 3: మండలంలోని దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెకు చెందిన షేక్.నౌజియా(19) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు రాయచోటిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.